# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | శుక్రవారం - 29 - మే - 2026 | సంపుటి : 3 | సంచిక : 361 | పేజీలు : 8 | వెల : రూ 5 | www.telanganamuchatlu.in


## రైతు గోసకు బీజేపీ భరోసా


**కడెం, ఖానాపూర్‌లో ఈటెల పర్యటన**

**రైతులతో మాట్లాడిన బీజేపీ నేతలు**

**ధాన్యం కొనుగోళ్లపై ఆరా**

2లో





హైదరాబాద్‌లో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ

సంక్షేమం, అభివృద్ధిపై సీఎం రేవంత్ వ్యాఖ్యలు

తెలంగాణను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తామన్న సీఎం

## ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

**హైదరాబాద్, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):**

ఉక్కు మహిళ ఇందిరా గాంధీ, తెలుగుజాతి గర్వించదగిన నాయకుడు నందమూరి తారక రామారావు స్ఫూర్తితో రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను కొన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ అమీర్‌పేట్ మైత్రివనం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు విగ్రహాన్ని ఆయన గురువారం ఆవిష్కరించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, మహమ్మద్ అజారుద్దీన్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

మిగతా 2లో..

## చివరి గింజ వరకు సేకరణ

**తడిసిన ధాన్యానికీ భరోసా**

**రైతుల పక్షానే ప్రభుత్వం అంటున్న మంత్రులు**

**యాదాద్రి భువనగిరి, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):**

రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్లపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సమావేశానికి రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల

మిగతా 2లో..





## సమగ్ర సంక్షేమ కార్డు దిశగా తెలంగాణ

**ప్రతి పథకం వివరాలు ఒకే కార్డులో**

**ఏఐ ఆధారిత విశ్లేషణపై దృష్టి**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):**

రాష్ట్రంలోని ప్రతి పౌరుడికి అందుతున్న సంక్షేమ పథకాల వివరాలన్నీ ఒకే కార్డులో అందుబాటులో ఉండేలా సమగ్ర సంక్షేమ కార్డును రూపొందించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఏ పౌరుడికి ఏ శాఖ ద్వారా, ఏ పథకం కింద ఎంత మేర లబ్ధి అందుతోందో స్పష్టంగా కనిపించే విధంగా ఈ కార్డు ఉండాలని సూచించారు. దీనికోసం వెంటనే అవసరమైన చర్యలు

మిగతా 2లో..



## గవర్నర్‌ను కలిసిన విద్యార్థులు

**యువ సంగమ్ కార్యక్రమంలో భాగస్వామ్యం**

**జాతీయ ఐక్యతపై చర్చ**

**హైదరాబాద్, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):**

కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ - యువ సంగమ్" ఆరో విడత కార్యక్రమంలో భాగంగా మేఘాలయలోని భారతీయ నిర్వహణ సంస్థ షిల్లాంగ్ విద్యార్థులు తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని లోక్ భవన్‌లో ఈ భేటీ జరిగింది. దేశంలోని వివిధ రాష్ట్రాల మధ్య సాంస్కృతిక, విద్యా, సామాజిక అనుబంధాలను బలోపేతం చేయాలనే లక్ష్యంతో యువ సంగమ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు

మిగతా 2లో..

## బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కోమటిరెడ్డి

**ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు**


**మైనారిటీల సంక్షేమానికి కట్టుబాటు**

**త్వరలో షాదీఖానా పూర్తి చేస్తామన్న హామీ**

**నల్లగొండ, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):**

బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని నల్లగొండ ఈద్గాలో ముస్లిం సోదరులతో కలిసి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. స్వార్థాన్ని విడిచిపెట్టి సమాజ శ్రేయస్సు కోసం పాటుపడాలనే గొప్ప సందేశాన్ని ఈ పండుగ అందిస్తుందని పేర్కొన్నారు. ముస్లిం సోదరులతో ఆప్యాయంగా మమేకమైన కోమటిరెడ్డి వెంకటరెడ్డి, సమాజంలో సౌభ్రాతృత్వం

మిగతా 2లో..





## పల్లెల్లో జోరుగా ఉపాధి హామీ పనులు

2లో

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సమగ్ర సంక్షేమ కార్డు దిశగా తెలంగాణ

(మొదటి పేజీ తరువాయి)

చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలోని అన్ని శాఖల నుంచి లబ్ధిదారుల వివరాలను సేకరించేందుకు ప్రత్యేక కార్యక్రమం చేపట్టాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, సమాచార సాంకేతిక శాఖ సంయుక్త కార్యదర్శి అనుదీప్ దురిశెట్టి తదితర ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఈ అంశంపై విస్తృతంగా చర్చించారు. సమగ్ర సంక్షేమ కార్డు ద్వారా ప్రతి పౌరుడి పూర్తి సంక్షేమ వివరాలు ఒకే చోట అందుబాటులోకి వస్తాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ సమాచారాన్ని కృత్రిమ మేధస్సు సహాయంతో విశ్లేషిస్తే సంక్షేమ పథకాల అమలులో పారదర్శకత పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. నిజమైన అర్హులకు పథకాలు మరింత ఖచ్చితంగా చేరేలా వ్యవస్థ రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ వేర్వేరుగా కార్డులు జారీ చేసే విధానానికి బదులుగా సమాచార సాంకేతిక శాఖ ఆధ్వర్యంలో ఒకే సమగ్ర కార్డు ఉండాలని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ, ముఖ్యమంత్రి సహాయ నిధి, ఫీజు రీయింబర్స్‌మెంట్, కార్మిక శాఖ, విద్యా శాఖ, బీమా పథకాల వివరాలు ఈ కార్డులో ఉండాలని సూచించారు. అవసరమైతే రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక గుర్తింపు సంఖ్య జారీ చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని చెప్పారు. ఇటీవల నిర్వహించిన సమగ్ర సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే వివరాలను కూడా ఈ కార్డుతో అనుసంధానం చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. వివిధ శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల వివరాలను కూడా సేకరించాలని సమాచార సాంకేతిక శాఖకు సూచించారు. ఏఐ ఆధారిత ప్రొఫైలింగ్ ద్వారా ప్రభుత్వ సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మరణ ధృవీకరణ పత్రం జారీ అయిన వెంటనే ఆ సమాచారం సంబంధిత సంక్షేమ పథకాల డేటాబేస్‌కు చేరేలా వ్యవస్థ ఉండాలని చెప్పారు. ప్రజల ఆరోగ్య వివరాలను కూడా సమగ్ర సంక్షేమ కార్డుతో అనుసంధానం చేయాలని సూచించారు. గల్ఫ్ దేశాలకు వలస వెళ్లే కార్మికుల విషయంలో కేరళ అమలు చేస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి తెలిపారు. నైపుణ్యాభివృద్ధి, శిక్షణ, పాస్‌పోర్టులు, వీసాలకు సంబంధించిన సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచితే అనధికార ఏజెంట్ల ప్రభావం తగ్గుతుందని పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ ఫలాలు ఖచ్చితంగా చేరేలా ఈ సమగ్ర సంక్షేమ కార్డు ఉపయోగపడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

# గవర్నర్‌ను కలిసిన విద్యార్థులు

(మొదటి పేజీ తరువాయి)

అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా యువత దేశ వైవిధ్యాన్ని అర్థం చేసుకునే అవకాశం లభిస్తోందని పేర్కొన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా విద్యార్థులతో ముచ్చటిస్తూ భారతదేశ ఐక్యత, సాంస్కృతిక వైవిధ్యం ప్రాముఖ్యతపై మాట్లాడారు. యువత దేశ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని సూచించారు. వివిధ రాష్ట్రాల సంప్రదాయాలు, సంస్కృతులను తెలుసుకోవడం ద్వారా జాతీయ సమైక్యత మరింత బలపడుతుందని అన్నారు. విద్యార్థులు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ఆసక్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. రాష్ట్రంలోని విద్యా, సాంకేతిక రంగాల పురోగతిపై కూడా చర్చ జరిగింది. తెలంగాణ అభివృద్ధి నమూనాను విద్యార్థులు అభినందించినట్లు అధికారులు తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారా యువతలో పరస్పర అవగాహన పెంపొందుతుందని నిర్వాహకులు పేర్కొన్నారు. దేశంలోని భిన్న ప్రాంతాల విద్యార్థులు ఒకరినొకరు అర్థం చేసుకునే వేదికగా యువ సంగమ్ నిలుస్తోందని తెలిపారు. జాతీయ సమైక్యత బలోపేతానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని అభిప్రాయపడ్డారు. భేటీ అనంతరం విద్యార్థులు గవర్నర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణలో తమకు లభించిన ఆతిథ్యంపై ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో కొనసాగింది.

# పల్లెల్లో జోరుగా ఉపాధి హామీ పనులు

- **కూలీల హాజరులో భారీ పెరుగుదల**
- **నీటి సంరక్షణ పనులకు ప్రాధాన్యత**
- **ఎనిమిది కోట్ల పని దినాల లక్ష్యంపై దృష్టి**
- **మంత్రి సీతక్క**

**హైదరాబాద్, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ గ్రామాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మంత్రి సీతక్క వరుస సమీక్షలతో రాష్ట్రవ్యాప్తంగా ఉపాధి పనుల్లో కొత్త ఉత్సాహం కనిపిస్తోంది. ప్రతిరోజూ జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు, మండల అభివృద్ధి అధికారులు, పంచాయతీ రాజ్ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారు. మే నెల ప్రారంభంలో మండుతున్న ఎండలు, సాంకేతిక సమస్యలు, మొబైల్ ఫోటో నమోదు ఇబ్బందులతో కూలీలు పనులకు రావడంలో ఆసక్తి చూపలేదు. ఆ సమయంలో రోజుకు లక్ష మంది కూలీలు కూడా పనులకు హాజరుకావడం కష్టంగా మారిందని అధికారులు తెలిపారు. అయితే మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో పరిస్థితి పూర్తిగా మారిపోయిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా రోజుకు కనీసం పదహారు లక్షల మంది కూలీలు ఉపాధి హామీ పనులకు హాజరవుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. మే మొదటి వారంలో ఏడు లక్షల పరిధిలో ఉన్న హాజరు ఇప్పుడు పదహారు లక్షల ఇరవై నాలుగు వేల మందికి చేరిందని అధికారులు తెలిపారు. ఇది ప్రభుత్వ ప్రత్యేక చర్యలకు నిదర్శనమని పేర్కొన్నారు. కూలీల హాజరు తక్కువగా ఉన్న జిల్లాలు, మండలాలను గుర్తించి ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. గ్రామాల వారీగా ఇంఛార్జ్‌లను నియమించి ప్రతి కుటుంబానికి పని అందేలా చర్యలు తీసుకుంటున్నారు. వికార్‌బాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, నల్గొండ, రాజన్న సిరిసిల్ల జిల్లాలు అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తున్నాయని ప్రభుత్వం వెల్లడించింది. ఉపాధి పనుల్లో భాగంగా చెరువులు, ఊటకుంటలు, పంటకాలువల్లో పూడికతీత పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారు. భూగర్భ జలాలను పెంచే పనులను విస్తృతంగా చేపడుతున్నారు. ప్రతి గ్రామంలో కనీసం మూడు నీటి సంరక్షణ పనులు నిర్వహించాలని అధికారులకు మంత్రి సీతక్క ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రానికి కేటాయించిన ఎనిమిది కోట్ల పని దినాల లక్ష్యాన్ని పూర్తి చేయడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇప్పటివరకు సుమారు నాలుగు కోట్ల యాభై లక్షల పని దినాలు పూర్తయ్యాయని అధికారులు తెలిపారు. మిగిలిన పని దినాలను కూడా సమయానికి పూర్తి చేయాలని ప్రభుత్వం పట్టుదలగా పనిచేస్తోందన్నారు. తెలంగాణ పల్లెల్లో పని ఆగకుండా, పేద కుటుంబాల ఆదాయం తగ్గకుండా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని మంత్రి సీతక్క స్పష్టం చేశారు. వర్షాకాలానికి ముందే నీటి సంరక్షణ పనులు పూర్తి చేసి గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు. చెరువులు నిండితే రైతు బలపడతాడని, భూగర్భ జలాలు పెరిగితే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఆమె తెలిపారు.

# ఎన్టీఆర్ స్ఫూర్తితో ప్రజాపాలన

(మొదటి పేజీ తరువాయి)

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ దేశ చరిత్రను చదవాలన్నా, స్ఫూర్తి పొందాలన్నా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఇందిరా గాంధీ, ఎన్టీఆర్‌లను స్మరించుకోవాలని అన్నారు. ఈ దేశం ఉన్నంతకాలం వారి కీర్తి ప్రతిష్ఠలు నిలిచిపోతాయని పేర్కొన్నారు. ప్రజా సేవలో వారి పాత్ర చిరస్మరణీయమని కొనియాడారు. ఎన్టీఆర్ నీతి, నిజాయితీ, నిబద్ధత కలిగిన నాయకుడని ముఖ్యమంత్రి అభివర్ణించారు. కులాలు, మతాలు, భాషలకు అతీతంగా ప్రజల మనసుల్లో నిలిచిన నాయకుడని అన్నారు. తెలంగాణ నుంచి అనేక మంది నాయకులకు ఎన్టీఆర్ రాజకీయ భిక్ష పెట్టారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకే ఈ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్నామని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లాలన్న సంకల్పంతో ప్రభుత్వం పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. హైదరాబాద్‌లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. ముప్పై వేల ఎకరాల్లో ప్రతిష్ఠాత్మక భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. ప్రపంచ దిగ్గజ సంస్థలను తెలంగాణకు తీసుకురావడంతో పాటు యువతను ఆ సంస్థల యజమానులుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. రాష్ట్రంలో మూడు కోట్ల ఇరవై నాలుగు లక్షల మందికి సన్నబియ్యం అందిస్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు. ఎన్టీఆర్ అమలు చేసిన రెండు రూపాయలకే కిలో బియ్యం పథకం తమకు స్ఫూర్తి అని అన్నారు. కూడు, గుడ్డ, నీడ అనే భావనతోనే ప్రస్తుతం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. జనతా వస్త్రాల పథకం స్ఫూర్తితో ఆడబిడ్డలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. ఇందిరమ్మ ఆశీర్వాదం, ఎన్టీఆర్ స్ఫూర్తి ప్రజాపాలనలో ప్రతిఫలిస్తోందని ముఖ్యమంత్రి అన్నారు. మహిళలకు రిజర్వేషన్ల అంశంలో రాజీవ్ గాంధీ, ఎన్టీఆర్ సేవలను గుర్తుచేసుకున్నారు. మహిళలకు ముప్పై మూడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పార్లమెంట్‌లో మద్దతు ఇస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఇషా సింగ్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు







**హైదరాబాద్,మే28(తెలంగాణ ముచ్చట్లు):** ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్2026 షూటింగ్ పోటీల్లో అసాధారణ ప్రతిభ కనబరిచి చారిత్రాత్మక విజయం సాధించిన హైదరాబాద్‌కు చెందిన యువ షూటర్ ఇషా సింగ్కు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు.మ్యూనిచ్‌లో జరుగుతున్న ఐఎస్ఎస్ఎఫ్ ప్రపంచ కప్ మహిళల 25 మీటర్ల పిస్టల్ ఫైనల్లో 43 హిట్స్ సాధించి ప్రపంచ రికార్డును బద్దలు కొట్టిన ఇషా సింగ్ విజయం భారత షూటింగ్ క్రీడా చరిత్రలో చిరస్మరణీయ ఘట్టంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు.

అంకితభావం, క్రమశిక్షణ, పట్టుదలతో ముందుకు సాగుతున్న ఇషా సింగ్ లక్షలాది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోందని కొనియాడారు. ఆమె ప్రదర్శన భారత క్రీడాకారుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపుతుందని, దేశ క్రీడా భవిష్యత్తుకు ఇది మంచి సంకేతమని అన్నారు.భవిష్యత్తులో ఇషా సింగ్ మరెన్నో విజయాలు సాధించి దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

# రైతు గోసకు బీజేపీ భరోసా

**నిర్మల్, 28 మే (తెలంగాణ ముచ్చట్లు):** రైతు గోస – బీజేపీ భరోసా యాత్రలో భాగంగా మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్ నిర్మల్ జిల్లా కడెం, ఖానాపూర్ ప్రాంతాల్లో రైతులతో సమావేశమయ్యారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని వారికి భరోసా కల్పించారు. కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలిస్తూ కొనుగోళ్ల పరిస్థితిపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఈటెల రాజేందర్ రైతులతో నేరుగా మాట్లాడి ధాన్యం కొనుగోళ్లు, మద్దతు ధర, తడిసిన ధాన్యం సమస్యలపై వివరాలు తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. రైతుల సమస్యల పరిష్కారానికి భారతీయ జనతా పార్టీ అండగా ఉంటుందని పేర్కొన్నారు. యాత్రలో బీజేపీ శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు. ఆయనతో పాటు ఎమ్మెల్యేలు పవార్ రామారావు పాటిల్, పైడి రాకేష్ రెడ్డి, ఎమ్మెల్సీలు మల్కా కొమరయ్య, అంజిరెడ్డి, ఏవీఎన్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు బస్వాపురం లక్ష్మీ నర్సయ్య కూడా రైతులతో మాట్లాడారు. రైతుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకోవడానికే ఈ యాత్ర చేపట్టినట్లు ఈటెల రాజేందర్ తెలిపారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతులకు తక్షణ సహాయం అందించాలని కోరారు.

రైతులు కూడా తమ సమస్యలను నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. కొనుగోళ్లలో జాప్యం, రవాణా సమస్యలు, గోదాముల కొరత వంటి అంశాలను ప్రస్తావించారు. రైతుల కష్టాలను ప్రభుత్వం గుర్తించి తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యాత్రలో స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామాల్లో బీజేపీ నాయకులకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం పోరాటం కొనసాగిస్తామని ఈటెల రాజేందర్ స్పష్టం చేశారు.

# చివరి గింజ వరకు సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు, పలువురు ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రైతులు పండించిన వరి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం పూర్తిగా రైతుల పక్షాన నిలుస్తుందని పేర్కొన్నారు. ఎలాంటి ఆర్థిక పరిస్థితులు ఎదురైనా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయడం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా నిబంధనల ప్రకారం పరిశీలించి కొనుగోలు చేస్తున్నామని వెల్లడించారు. రైతులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని భరోసా ఇచ్చారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఈసారి రాష్ట్రంలో వరి దిగుబడి అద్భుతంగా వచ్చిందన్నారు. కనీస మద్దతు ధర ప్రకారం రైతులకు చెల్లింపులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు. అత్యధిక మొత్తంలో రైతుల ఖాతాల్లో నేరుగా డబ్బులు జమ చేస్తున్నామని పేర్కొన్నారు. మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ఈసారి వరి దిగుబడి అధికంగా నమోదైందన్నారు. రైతుల శ్రమకు తగిన గౌరవం దక్కేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. రైతులు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని అన్నారు. సమావేశంలో రాష్ట్ర పౌర సరఫరాల కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి, జిల్లా ఎస్పీ అక్షాంశ్ యాదవ్ సహా పలువురు అధికారులు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేసి రైతులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రులు స్పష్టం చేశారు.

# బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కోమటిరెడ్డి



(మొదటి పేజీ తరువాయి)

మరింత బలపడాలని ఆకాంక్షించారు. అన్నివర్గాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి జీవించాలనే భావనను బక్రీద్ పండుగ చాటిచెబుతుందని అన్నారు. పండుగలు ప్రజలను మరింత దగ్గర చేసే శక్తిగా నిలుస్తాయని వ్యాఖ్యానించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో సందేశం దేశ ఐక్యతకు ప్రతీక అని కోమటిరెడ్డి తెలిపారు. వైఎస్సార్ అందించిన నాలుగు శాతం రిజర్వేషన్ల స్ఫూర్తితో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని చెప్పారు. అన్ని వర్గాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.

నల్లగొండ ముస్లిం సోదరుల కోసం నిర్మిస్తున్న షాదీఖానా పనులను త్వరలోనే పూర్తి చేస్తామని కోమటిరెడ్డి హామీ ఇచ్చారు. మైనారిటీల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తామని పేర్కొన్నారు. ఈద్గాలో జరిగిన ప్రార్థనల్లో పెద్ద సంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు. కోమటిరెడ్డి వెంకటరెడ్డికి స్థానికులు స్వాగతం పలికారు. పండుగ వాతావరణంలో పరస్పరం శుభాకాంక్షలు తెలుపుకుంటూ ప్రజలు ఆనందంగా గడిపారు. బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. శాంతి, సౌభ్రాతృత్వం, సేవా భావం పెంపొందాలని మత పెద్దలు ఆకాంక్షించారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని ప్రార్థనలు చేశారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళన కరపత్రాన్ని విడుదల చేసిన మోత్కుపల్లి



**హైదరాబాద్,మే28(తెలంగాణ ముచ్చట్లు):** జూన్ 21న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనానికి సంబంధించిన కరపత్రాన్ని మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహ విడుదల చేశారు.కొత్తకోట పట్టణంలో ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మోత్కుపల్లి నరసింహ సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పింఛన్, గుర్తింపు కార్డులు కల్పించాలనే ప్రధాన డిమాండ్లతో ఈ నెల 21న ఇందిరాపార్క్‌లో తెలంగాణ ఉద్యమకారుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ముంజగళ్ల విజయ్, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ముపురి కుమార్, మీసాల మహేష్ తదితర నాయకులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై గళమెత్తనున్న భారీ బహిరంగ సభ



**జమ్మికుంట టౌన్ మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** ధర్మ సమాజ్ పార్టీ మద్దతుతో బీసీ, ఎస్సీ, ఎస్టీ జేఏసీ ఆధ్వర్యంలో జూన్ 4న కరీంనగర్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి నాయకులు విస్తృతంగా మద్దతు కూడగడుతున్నారు. ఇందులో భాగంగా బుధవారం జమ్మికుంట మండలంలో పలువురు మైనార్టీ, కుల సంఘాల నాయకులను కలిసి సభకు ఆహ్వానించారు. ఈ సందర్భంగా మైనార్టీ షేరియా కమిటీ అధ్యక్షులు జాకీర్ గారిని, ఉపాధ్యక్షులు జాకీర్ మహమ్మద్ గారిని ప్రత్యేకంగా కలిసి సభ ప్రాముఖ్యతను వివరించి, భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అలాగే వివిధ కుల సంఘాల నాయకులతో సమావేశమై సామాజిక న్యాయం, హక్కుల సాధన కోసం ఈ సభ కీలకమని తెలిపారు. నాయకులు మాట్లాడుతూ.. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల సమస్యలు, హక్కుల పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈ సభ ప్రజల్లో చైతన్యం తీసుకురావడంలో ముఖ్యపాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. జూన్ 4న కరీంనగర్‌లో జరిగే సభకు అన్ని వర్గాల ప్రజలు పెద్దఎత్తున హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి చిలువేరు శ్రీకాంత్, హుజురాబాద్ జేఏసీ ఇంచార్జి చందు యాదవ్, జమ్మికుంట మండల నాయకులు మాడుగుల సందీప్, సాగర్ పాల్గొన్నారు.

## ప్రజల భద్రతే లక్ష్యం ఎల్కతుర్తిలో విస్తృత వాహన తనిఖీలు



**ఎల్కతుర్తి, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని హన్మకొండ జిల్లా ఎల్కతుర్తి మండల కేంద్రంలో గురువారం సాయంత్రం పోలీసులు విస్తృత స్థాయిలో ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించారు. ఎల్కతుర్తి ఎస్ఐ నరసింహరావు ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో మద్యం సేవించి వాహనం నడుపుతున్న ఒక వ్యక్తిని గుర్తించి కేసు నమోదు చేశారు.మండల కేంద్రంలోని ప్రధాన రహదారులు, కూడళ్లు, రద్దీ ప్రాంతాల్లో పోలీసులు వాహనాలను ఆపి డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, ఇన్సూరెన్స్ పత్రాలను పరిశీలించారు. అదే సమయంలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించేందుకు ప్రత్యేక పరికరాలతో పరీక్షలు నిర్వహించారు. తనిఖీల సమయంలో హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు, సీట్ బెల్ట్ ధరించని కార్ డ్రైవర్లకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరసింహరావు మాట్లాడుతూ మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశాలు అధికంగా ఉంటాయని తెలిపారు. కొద్దిసేపటి నిర్లక్ష్యం జీవితాంతం బాధను మిగులుస్తుందని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. ముఖ్యంగా యువత వేగవంతమైన డ్రైవింగ్, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం మానుకోవాలని హెచ్చరించారు. ప్రజల ప్రాణాలు సురక్షితంగా ఉండేందుకు పోలీసులు నిరంతరం ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం, ట్రిపుల్ రైడింగ్, హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి నిబంధనల ఉల్లంఘనపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాత్రి వేళల్లో వాహనదారులు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పోలీసులు చేపడుతున్న ఈ ప్రత్యేక తనిఖీలు ప్రజల రక్షణ కోసమేనని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ పోలీసులకు సహకరించాలని కోరారు. రాబోయే రోజుల్లో కూడా మండలంలోని పలు ప్రాంతాల్లో అకస్మిక తనిఖీలు కొనసాగనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎడ్కాని స్టేబుళ్లు విటల్, భాస్కర్ రెడ్డి, రాజు, ఆఖిల్ తదితరులు పాల్గొన్నారు.





# ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇవ్వాలి

**ఉద్యమ కారుల జెఏసి వ్యవస్థాపకులు పిడమర్తి రవి**

**హైదరాబాద్,మే28(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం కేటాయించడంతో పాటు పింఛన్, గుర్తింపు కార్డులు ఇవ్వాలని తెలంగాణ ఉద్యమకారుల సంఘం వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు.నాగర్‌కర్నూల్ పట్టణంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ రహీం ఆధ్వర్యంలో నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన పిడమర్తి రవి మాట్లాడారు. జూన్ 21న ఇందిరాపార్క్‌లో నిర్వహించే ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని వేలాదిమంది ఉద్యమకారులు హాజరై విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉద్యమకారుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం స్పందించాలని కోరారు. నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఉద్యమకారులు రాములు నాయక్, ధర్మరాజు, గుడిపల్లి రవి, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, జయశంకర్, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ, పోలే నరేందర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

## వెల్టూర్ లో ఘనంగా ఎన్టీఆర్ జయంతి వేడుకలు

**పెద్దమందడి,మే28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం వెల్టూర్ గ్రామంలో మాజీ ముఖ్యమంత్రి, తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు నందమూరి తారక రామారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన మండల అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహానేత ఎన్టీఆర్ అని కొనియాడారు. పేద ప్రజల సంక్షేమం కోసం ఆయన ప్రవేశపెట్టిన పథకాలు నేటికీ ప్రజలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని అన్నారు.రాజకీయాల్లో విలువలు, ప్రజా సేవకు ఎన్టీఆర్ మారుపేరుగా నిలిచారని పేర్కొన్నారు.సినీ రంగంలోనూ, రాజకీయాల్లోనూ చెరగని ముద్ర వేసిన ఎన్టీఆర్ ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. అనంతరం కార్యకర్తలతో కలిసి జయంతి వేడుకలను నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దయల రమేష్, మెరుగు కుర్మయ్య, ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.



## నేలకొండపల్లి బౌద్ధ స్తూపానికి అంతర్జాతీయ రూపురేఖలు!

- **మంత్రి పొంగులేటి ఆదేశాలతో రూపుదిద్దుకుంటున్న సమగ్ర మాస్టర్ ప్లాన్**
- **చారిత్రక క్షేత్రంలో వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం క్షేత్రస్థాయి పరిశీలన**



**ఖమ్మం బ్యూరో, మే 28(తెలంగాణ ముచ్చట్లు):** నేలకొండపల్లి బౌద్ధ మహాస్తూపాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కసరత్తును వేగవంతం చేసింది. తెలంగాణ రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ క్షేత్రం అభివృద్ధి కోసం రూ. 2.50 కోట్ల నిధులు మంజూరైన సంగతి తెలిసిందే. అయితే ఈ నిధులతో పాటు ఈ చారిత్రక క్షేత్రానికి అంతర్జాతీయ స్థాయి హంగులు అద్దేందుకు ఇంకా ఎంత వ్యయం అవుతుంది, ఎలాంటి పనులు చేపట్టాలనే అంశాలపై సమగ్ర ప్రాజెక్టు నివేదిక సిద్ధం చేయాలని మంత్రి ఆదేశించిన నేపథ్యంలో గురువారం వారసత్వ శాఖ ఉన్నత స్థాయి బృందం ఇక్కడ క్షేత్రస్థాయి పరిశీలన జరిపింది.

డి.పి.ఆర్ రూపకల్పన కోసం ఉన్నత స్థాయి బృందం

తెలంగాణ వారసత్వ శాఖ డైరెక్టర్ ప్రొఫెసర్ అర్జున్ రావు కుతాటి, బుద్ధవనం ప్రాజెక్ట్ మెంటార్ సి.ఆంజనేయ రెడ్డి నేతృత్వంలోని ఉన్నతాధికారులు, పురావస్తు నిపుణుల బృందం నేలకొండపల్లి బౌద్ధ స్తూపాన్ని విస్తృతంగా పరిశీలించింది. మంజూరైన రూ. 2.50 కోట్ల నిధుల వినియోగంతో పాటు, భవిష్యత్ నిధుల అంచనాలు, ల్యాండ్ స్కేపింగ్, పర్యాటక హంగుల రూపకల్పనపై నిపుణుల బృందం క్షేత్రస్థాయిలోనే సుదీర్ఘంగా సమీక్షించింది.

ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ సర్వే

మాస్టర్ ప్లాన్‌లో భాగంగా, కేవలం ఉపరితల తవ్వకాలకే పరిమితం కాకుండా ఎన్‌జీఆర్ఐ సహకారంతో భూగర్భ జియోఫిజికల్ సర్వే నిర్వహించాలని నిర్ణయించారు. దీని ద్వారా భూగర్భంలో దాగివున్న చారిత్రక అవశేషాలను శాస్త్రీయంగా వెలికితీసి రక్షించనున్నారు. అలాగే, పర్యాటక వసతుల విస్తరణ కోసం సుమారు నాలుగు ఎకరాల భూమిని సేకరించాలని తీర్మానించారు.

ఆధునిక పర్యాటక వసతులు

ఇక్కడ పర్యాటకుల కోసం చరిత్రను ప్రతిబింబించే త్రీడీ ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్, ఆడియోవిజువల్ గ్యాలరీలు, ఓపెన్ ఎయిర్ అంఫీ థియేటర్, అంతర్జాతీయ స్థాయి వాకింగ్ మార్గాలు, లైటింగ్ వంటి మౌలిక వసతులను ఈ నివేదికలో చేర్చనున్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ఆదేశాల మేరకు, పూర్తి వ్యయ అంచనాలతో కూడిన ఈ 'సమగ్ర నివేదిక' ను రాబోయే రెండు నెలల్లో ప్రభుత్వానికి సమర్పిస్తామని వారసత్వ శాఖ డైరెక్టర్ వెల్లడించారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలి

**ఉద్యమకారుల జెఏసి వ్యవస్థాపకుడు పిడమర్తి రవి**



**హైదరాబాద్,మే28(తెలంగాణ ముచ్చట్లు):** జూన్ 21న ఇంద్రపార్క్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పిడమర్తి రవి పిలుపునిచ్చారు.వనపర్తి పట్టణంలోని ఆర్ అండ్ బి అతిథి గృహంలో తెలంగాణ ఉద్యమకారుల ఆత్మీయ సమ్మేళన సన్నాహక సమావేశాన్ని ఉద్యమకారుల ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు ఉల్యంకొండ రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ పిడమర్తి రవి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, గుర్తింపు కార్డులు, పింఛన్ కల్పించాలని ప్రధాన డిమాండ్లుగా పేర్కొన్నారు. ఈ డిమాండ్ల సాధన కోసం చేపట్టనున్న ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జూన్ 21న జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరుకానున్నట్లు తెలిపారు. ఉద్యమకారుల సంక్షేమం కోసం అందరూ ఐక్యంగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల రాష్ట్ర ఉపాధ్యక్షుడు చీర్ల సత్యం, ఓయూ జేఏసీ అధ్యక్షుడు ఎండీ రహీం, అన్వర్, పీయూ జేఏసీ నాయకులు, ప్రజా వాగ్గేయకారులు రాజారాం ప్రకాష్, తెలంగాణ గాంధీ యాదగిరి, టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు ఖాదర్ పాషా, బీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బోరెల్లి సురేష్, ముప్పారం కుమార్, రొడ్డ నిరంజన్, మీసాల మహేష్ పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర : మాజీ ఎంపీ నామ

- **ఎన్టీఆర్ కు కేంద్రం భారతరత్న ప్రకటించాలి: మాజీ ఎంపీ నామ**



**ఖమ్మం బ్యూరో , మే28(తెలంగాణ ముచ్చట్లు ):** ఎన్టీఆర్ జననమే ఒక చరిత్ర అని బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు ఎన్టీఆర్ జయంతి సందర్భంగా గురువారం నాడు ఖమ్మం నగరం లోని లకారం ట్యాంక్ బండ్ నందు ఉన్న 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం వద్ద మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య తో కలసి మాజీ ఎంపీ నామ నాగేశ్వర రావు నివాళ్లు అర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ రంగాల్లో చరిత్ర సృష్టించిన గొప్ప నాయకుడు ఎన్టీఆర్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన మహానేత, విశ్వవిఖ్యాత నటసార్వభౌముడు, మాజీ ముఖ్యమంత్రి డా. నందమూరి తారక రామారావు జయంతిని పురస్కరించుకొని ఆయన సేవలను స్మరించుకుంటున్నట్లు బీఆర్ఎస్ మాజీ లోక్‌సభ పక్ష నేత, ఖమ్మం మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఎన్టీఆర్ వ్యక్తిత్వం, సినీ మరియు రాజకీయ రంగాల్లో ఆయన సాధించిన ఘనతలు భావితరాలకు కూడా స్ఫూర్తిగా నిలుస్తున్నాయని నామ తెలిపారు. తెలుగు చలనచిత్ర రంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలు, రాష్ట్ర ప్రజల కోసం చేపట్టిన ప్రజాహిత కార్యక్రమాలు చిరస్మరణీయమని కొనియాడారు. రాజకీయ నాయకుడిగా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూనే విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. ఎన్టీఆర్ తన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాల ద్వారా పేదల జీవితాల్లో వెలుగులు నింపారని గుర్తు చేశారు. పటేల్-పట్వారీ వ్యవస్థ రద్దు, పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, రూ.2 కిలో బియ్యం, జనతా వస్త్రాల పంపిణీ, పేదలకు గృహ నిర్మాణాలు వంటి కార్యక్రమాలు సామాజిక న్యాయానికి నిదర్శనంగా నిలిచాయని పేర్కొన్నారు. ఈ పథకాలు పేదలకు ఆర్థికంగా, సామాజికంగా ఎంతో భరోసా కల్పించాయన్నారు. ఎన్టీఆర్‌కు భారతరత్న ప్రకటించడం తెలుగు ప్రజల చిరకాల కోరిక అని నామ పేర్కొన్నారు. ఆయన దేశానికి, తెలుగు జాతికి చేసిన సేవలను గుర్తించి భారతరత్న పురస్కారం ప్రకటించాలని తాను 17వ లోక్‌సభలో కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన విషయాన్ని గుర్తు చేశారు. పార్లమెంట్‌లో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు కోసం ఆనాడు పార్లమెంటరీ పార్టీ నేతగా ఉండి 15వ లోక్‌సభలో తాను చేసిన పోరాటం అలాగే ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల సహకారం, అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో పాటు నాటి లోక్‌సభ స్పీకర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి పార్లమెంట్ ప్రాంగణంలో ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు జరిగిందన్నారు. ఎన్టీఆర్ మరణించిన 17 సంవత్సరాల తర్వాత 2013 తాను తాను ఎంపీ గా ఉన్న సమయంలో ఆ విగ్రహం ఏర్పాటులో భాగస్వామ్యం కావడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. అంతేకాకుండా ఖమ్మంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని, తెలుగు జాతి గర్వించదగ్గ మహానేతకు ఇది నిజమైన నివాళిగా నిలిచిందని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా వ్యాప్తంగా అనేక ఎన్టీఆర్ విగ్రహాల ఏర్పాటు కార్యక్రమాల్లో కూడా తాను భాగస్వామ్యం అయినట్లు తెలిపారు. తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీకగా నిలిచిన ఎన్టీఆర్ స్ఫూర్తిని భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఆయా ప్రాంతాల్లో విగ్రహాల ఏర్పాటుకు కృషి చేసినట్లు నామ నాగేశ్వరరావు పేర్కొన్నారు. కేసీఆర్ కూడా తన హయాంలో ఎన్టీఆర్ లా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని తెలిపారు.
కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్ కుమార్, ఆర్జేసీ కృష్ణ తో పాటు పలు మండలాల నుండి పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

## సోదరభావానికి ప్రతీకగా హుజురాబాద్‌లో బక్రీద్ సంబరాలు



**హుజురాబాద్, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ పట్టణంలో బక్రీద్ పండుగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఈద్గాలకు భారీగా తరలివచ్చిన ప్రజలు ప్రత్యేక నమాజ్ నిర్వహించి దేశం, రాష్ట్రంలో శాంతి, సౌభ్రాతృత్వం నెలకొనాలని ప్రార్థనలు చేశారు.
ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పట్టణమంతా పండుగ వాతావరణంతో కళకళలాడగా, మటన్ వంటలు, స్వీట్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కుటుంబ సభ్యులు, బంధుమిత్రులతో కలిసి ప్రజలు ఆనందోత్సాహాల మధ్య పండుగను జరుపుకున్నారు.
అదేవిధంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో యువకులు సేవా కార్యక్రమాలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు. పేదలకు ఆహారం పంపిణీ చేయడం, అవసరమైన వారికి సహాయం అందించడం వంటి కార్యక్రమాలతో బక్రీద్ సంబరాలు మరింత ప్రత్యేకంగా నిలిచాయి.

# మహిళా సంఘాలకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా నిలుస్తోంది

**రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి**



**జమ్మికుంట టౌన్ మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** జమ్మికుంట మున్సిపల్ పరిధిలోని 5వ వార్డులో కౌన్సిలర్ యాట్ల సునీత అశోక్ గార్ల ఆధ్వర్యంలో ఇందిరా మహిళా శక్తి మహిళా స్వయం సహాయక సంఘం ద్వారా "మీ రేవంతన్న కానుక" చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.
ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకరి రమేష్, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దేశిని కోటి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళా సంక్షేమానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని తెలిపారు.
మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడమే కాకుండా, ఆ బస్సుల యజమానులుగా మహిళలను తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. మహిళా సంఘాలకు పక్కా భవనాలు నిర్మించడం, సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు వంటి ఉపాధి అవకాశాల్లో మహిళలను భాగస్వామ్యం చేయడం ద్వారా వారిని ఆర్థికంగా బలోపేతం చేస్తున్నట్లు పేర్కొన్నారు.
మహిళలు ఆర్థికంగా ఎదిగితే కుటుంబాలు సంతోషంగా ఉంటాయని భావించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నారని అన్నారు. మహిళా సంఘాలకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలు గమనించి కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలని కోరారు.
ఈ కార్యక్రమంలో పిట్టల రమేష్, రాజ్‌కుమార్, ప్రశాంత్, శివకృష్ణతో పాటు మహిళా సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు, ఆర్పీలు, వీవోలు మరియు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ముల్కనూర్‌లో ఘనంగా రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



**భీమదేవరపల్లి, మే 28:(తెలంగాణ ముచ్చట్లు):** ముల్కనూర్ క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో 2026 రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ముల్కనూర్ హై స్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా ప్రారంభించారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని గ్రామాల జట్లు ఈ టోర్నమెంట్‌లో పాల్గొనవచ్చని నిర్వాహకులు తెలిపారు. గ్రామాల వారీగా ఆధార్ కార్డు ఆధారంగా జట్లకు అనుమతి కల్పిస్తామని వెల్లడించారు.
మొదటి విజేత జట్టుకు రూ.20,000 నగదు బహుమతి, ద్వితీయ విజేత జట్టుకు రూ.10,000 నగదు బహుమతి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. "Play Fair, Play Hard & Enjoy The Game" అనే నినాదంతో పోటీలు ఉత్సాహంగా కొనసాగనున్నాయని తెలిపారు.
ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు అదరి రవీందర్ యాదవ్, కొలుగూరి రాజు, వార్డు సభ్యులు ముత్యం అశోక్, గద్వాల సుకన్య ప్రశాంత్, టోర్నమెంట్ నిర్వాహకులు కాసగోని బాలకృష్ణ, అదరి రాజేందర్ యాదవ్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత ఆన్లైన్ విద్యను సద్వినియోగం చేసుకోండి మాజీ ఎంపీ నామ

- **లక్ష్యంతో చదివి రాణించండి యువతకు మాజీ ఎంపీ నామ పిలుపు**




**ఖమ్మం బ్యూరో, మే 28(తెలంగాణ ముచ్చట్లు ):** ఖమ్మం కార్పొరేషన్ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో జరిగిన కార్యక్రమంలో "రాకేష్ రెడ్డి ఈ క్లాస్సేస్ అప్ "ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, మాజీ ఎంపీ నామ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా నామ మాట్లాడుతూ గ్రామీణ, పట్టణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన కోచింగ్ అందించాలనే లక్ష్యంతో చక్రవర్తి రూపొందించిన ఈ యాప్‌కు ఎనుగుల రాకేష్ రెడ్డి ఆర్థిక సహకారం అందించడం అభినందనీయమన్నారు. నిపుణుల బోధనతో ఇంటి నుంచే మొబైల్ ద్వారా క్లాసులు వినే అవకాశం ఉందన్నారు. తక్కువ ఖర్చుతో పోటీ పరీక్షలకు సిద్ధమవ్వొచ్చని, యువత క్రమశిక్షణతో చదివి లక్ష్యాలు సాధించాలని సూచించారు. బిట్స్ పిలానీ యూనివర్సిటీ నుంచి విద్యాభ్యాసం పూర్తి చేసిన రాకేష్ రెడ్డి మంచి ఉద్యోగావకాశాలను వదులుకొని స్వగ్రామానికి సేవ చేయాలనే ఉద్దేశంతో ముందుకు రావడం ప్రశంసనీయమన్నారు. ప్రతి ఒక్కరి వద్ద ఉన్న మొబైల్‌ను సద్వినియోగం చేసుకొని ఈ యాప్ ద్వారా ఉచిత ఆన్‌లైన్ విద్యను పొందాలని, పోటీ పరీక్షల్లో రాణించాలని యువతకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో మాజీ ఎమ్మెల్యేలు తాటి వెంకటేశ్వర్లు, బొల్లం మల్లయ్య యాదవ్, ఆర్జెసి కృష్ణ, సుడా మాజీ చైర్మన్ బచ్చు విజయ కుమార్, నాయకులు పగడాల నాగరాజు, నాగండ్ల కోటేశ్వరరావు, లకావత్ గిరిబాబు, మోరంపొడి ప్రసాదరావు, మరికంటి రేణుబాబు, వాకదాని కోటేశ్వరరావు, మాటేటి కిరణ్, రేగళ్ల కృష్ణ ప్రసాద్, షారుఖ్ తదితరులు పాల్గొన్నారు.

# వనపర్తి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జయంతి వేడుకలు

- **ఎన్టీఆర్ మధుర గీతాలతో ఆలపించిన వనపర్తి గాయకులు**




**వనపర్తి,మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** నందమూరి తారక రామారావు 103వ జయంతి సందర్భంగా వనపర్తి కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం వనపర్తి పట్టణ కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో ఘనంగా జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు.అనంతరం వక్తలు మాట్లాడుతూ ఆయన సినీ జీవితంలో ఎన్నో కష్టాలు, ఒడిదుడుకులను ఎదుర్కొని సాధారణ స్థాయి నుంచి మహానటుడిగా ఎదిగిన చరిత్ర ప్రతి ఒక్కరికీ ఆదర్శమని కొనియాడారు.సినీ పరిశ్రమలో సాంఘిక, జానపద, పౌరాణిక పాత్రల్లో నటించి ప్రేక్షకులను మెప్పించారని తెలిపారు.ముఖ్యంగా శ్రీరాముడు, శ్రీకృష్ణుడు పాత్రల్లో ఆయన నటన తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిందన్నారు.తెలుగు ప్రజల జీవన విధానాన్ని ప్రభావితం చేసేలా ఎన్నో సందేశాత్మక, భక్తి, అభ్యుదయ చిత్రాలను రూపొందించి సమాజ చైతన్యానికి ఎన్టీఆర్ విశేష కృషి చేశారని పేర్కొన్నారు.ఇలాంటి మహనీయులను స్మరించుకోవడం తెలుగు ప్రజల బాధ్యత అని తెలిపారు.కార్యక్రమంలో వనపర్తి కళాకారులు, గాయకులు పాల్గొని ఎన్టీఆర్ చిత్రాల్లోని మధుర గీతాలను ఆలపించి శ్రోతలను అలరించారు.రానున్న రోజుల్లో కూడా ప్రజల సహకారంతో ఇలాంటి కార్యక్రమాలను మరింత విస్తృతంగా నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమంలో నందిమల్ల రాములు, డి. రవిప్రసాద్, గంధం రాజు, గంధం రవి పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా ఆర్ఎంఓ రవిశంకర్, ఎస్. రవిప్రసాద్ గౌడ్, హెచ్. గోవింద్, వెంకట్ తదితరులు హాజరయ్యారు.అలాగే నందిమల్ల సాంబయ్య, ఎం. సంజీవ్, డీఎస్పీ నాయకులు భీముడు, సూర్యప్రకాశ్, డి. గట్టయ్య, బి. ఆంజనేయులు పాల్గొన్నారు.

# బక్రీద్ వేళ సామరస్య సందేశం.. గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని డిమాండ్

**హుజురాబాద్, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** హుజురాబాద్ మండలం కందుగుల గ్రామంలో బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షుడు ఎండీనూరుల్లా ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించి నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ముస్లిం మైనారిటీ నాయకులు మాట్లాడుతూ, బక్రీద్ సందర్భంగా గోవు వధకు దూరంగా ఉండాలని, హిందువుల మనోభావాలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. అలాగే గోవును జాతీయ జంతువుగా ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దేశంలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవ భావంతో కలిసి జీవించాలని, శాంతి సామరస్యాల పరిరక్షణకు ప్రతి పౌరుడు కట్టుబడి ఉండాలని నాయకులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ముస్లిం మైనారిటీ సభ్యులు, యువకులు పాల్గొని సామరస్య సందేశాన్ని చాటారు.



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



# ఎన్టీఆర్ ఆశయాలు ఆదర్శం

- **గండుగులపల్లిలో ఎమ్మెల్యే జారె ఆదినారాయణ నివాళి.**



**దమ్మపేట, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు ప్రజల ఆత్మగౌరవ ప్రతీక, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 103వ జయంతి వేడుకలను దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జారె ఆదినారాయణ ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. తెలుగు ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత ఎన్టీఆర్ రాజకీయాలతో పాటు సినీరంగంలోనూ విశిష్ట సేవలు అందించారని పేర్కొన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టి ప్రజానాయకుడిగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. తెలుగువారి గౌరవాన్ని దేశవ్యాప్తంగా చాటిచెప్పిన మహనీయుడు ఎన్టీఆర్ ఆశయాలను నేటితరం ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

# తెలుగు జాతి గర్వకారణం ఎన్టీఆర్



- **సత్తుపల్లిలో ఘనంగా 103వ జయంతి వేడుకలు.**

**సత్తుపల్లి, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన మహానేత, ఉమ్మడి రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారకరామారావు 103వ జయంతి వేడుకలు గురువారం సత్తుపల్లి పట్టణంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహానికి సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎన్టీఆర్ తెలుగు వారి ఆత్మగౌరవాన్ని దేశ రాజకీయాల్లో నిలబెట్టిన మహానేత అని కొనియాడారు. సినీ రంగంలోనే కాకుండా రాజకీయాల్లోనూ తనదైన ముద్ర వేసి ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని అన్నారు. పేదల సంక్షేమం, సామాన్య ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేశారని గుర్తుచేశారు. ప్రజలకు సేవ చేయాలనే తపన, రాజకీయాల్లో విలువలు పాటించిన నాయకుడిగా ఎన్టీఆర్ ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తారని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

## ఎన్టీఆర్ కు నివాళి అర్పించిన వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్ప కృష్ణ చైతన్య



**ఖమ్మం బ్యూరో ,మే 28(తెలంగాణ ముచ్చట్లు ):** ఉమ్మడి రాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి , తెలుగువారి ఆత్మగౌరవాన్ని దశ దిశలా చాటి చెప్పిన దివంగత నందమూరి తారక రామారావు జయంతి పురస్కరించుకొని గురువారం వారధి ఫౌండేషన్ చైర్మన్ చింతనిప్పు కృష్ణ చైతన్య ఘనంగా నివాళులర్పించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ లోని నందమూరి తారక రామారావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ తెలుగుజాతి గౌరవాన్ని దేశ విదేశాలలో ఇనుమడింపజేసి తెలుగు భాషకు కీర్తి ప్రతిష్టలు తీసుకుని వచ్చిన అన్న ఎన్టీఆర్ జీవితం ప్రతి ఒక్కరికి మార్గదర్శకం అని తెలిపారు. ఎన్టీఆర్ చూపిన మార్గంలో తెలుగువారి ప్రతిష్ట పెరిగేలా కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మోతారపు శ్రావణి సుధాకర్ , ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.



# బాల్క సుమన్‌పై ఫిర్యాదు

**సత్తుపల్లిలో కాంగ్రెస్ నాయకుల చర్య.**

**సత్తుపల్లి, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** ప్రజలను రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేశారంటూ బీఆర్ఎస్ నాయకుడు బాల్క సుమన్‌పై సత్తుపల్లి పోలీస్ స్టేషన్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఫిర్యాదు చేశారు. భవనాలు కూల్చండి, కార్యాలయాలు ధ్వంసం చేయండి, రైల్వే పట్టాలు కోయండి అంటూ ప్రజా, ప్రభుత్వ ఆస్తుల ధ్వంసానికి ప్రేరేపించేలా బాల్క సుమన్ మాట్లాడారని ఫిర్యాదులో పేర్కొన్నారు. సత్తుపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ ఆదేశాల మేరకు సత్తుపల్లి సీఐకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ దోమ ఆనంద్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గాదె చెన్నారావు, సీనియర్ నాయకుడు చల్లగుళ్ల నరసింహారావు, కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పినరై విజయన్‌పై ఈడి దాడులు రాజకీయ కక్షసాధింపే.!

**సీపీఎం ఆధ్వర్యంలో నల్ల గుర్తులతో నిరసన ప్రదర్శన.**




**సత్తుపల్లి, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరై విజయన్ నివాసాలపై కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడి నిర్వహించిన దాడులను సీపీఎం తీవ్రంగా ఖండించింది. సీపీఎం సత్తుపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పాత సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలు నల్ల బ్యాడ్జీలు ధరించి ప్రదర్శన నిర్వహించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సమావేశంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మోరంపూడి పాండురంగారావు మాట్లాడుతూ.. బీజేపీకి వ్యతిరేకంగా పోరాడుతున్న ప్రతిపక్ష నాయకులపై కేంద్ర సంస్థలను ప్రయోగించడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమన్నారు. దేశవ్యాప్తంగా ప్రతిపక్ష పార్టీలను బలహీనపరిచే కుట్రలో భాగంగానే ఈ దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న వామపక్ష ఉద్యమాలను అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం ఈడిని రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తోందన్నారు. కేరళలో ఎల్‌డీఎఫ్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల్లో విశేష ఆదరణ లభించిందని, ఆ ప్రజాభిమానాన్ని తట్టుకోలేకే బీజేపీ ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఈ విధమైన బెదిరింపులు, దాడులకు వామపక్ష ఉద్యమం భయపడదని, ప్రజలతో కలిసి మరింత బలంగా పోరాడుతుందని సీపీఎం నాయకులు స్పష్టం చేశారు. కేంద్ర సంస్థలను రాజకీయ ప్రయోజనాల కోసం దుర్వినియోగం చేయడాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం సత్తుపల్లి పట్టణ కార్యదర్శి కొలికపోగు సర్వేశ్వరరావు, రావుల రాజబాబు, చెరకు రత్నకుమారి, గుదే రాము, పిల్లి నాయుడు, కోటయ్య, అర్జున్‌రావు, భాషా, శివాజీ, భాస్కర్, వెంకటేశ్వరరావు, రమేష్, నాగేశ్వరరావు, శ్రీను పాల్గొన్నారు.

# బక్రీద్ రోజున కబరస్థాన్‌కు తాళం.!

- **ప్రార్థనలకు వెళ్లిన ముస్లింల ఆవేదన.**



**సత్తుపల్లి, మే 28 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఉన్న కబరస్థాన్ వద్ద బక్రీద్ సందర్భంగా గురువారం ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ప్రార్థనలు చేసేందుకు వెళ్లిన ముస్లింలకు గేటుకు తాళం వేసి ఉండటంతో తీవ్ర నిరాశ ఎదురైంది. స్థానిక ముస్లింల కథనం ప్రకారం.. ఎన్టీఆర్‌నగర్‌లోని జెండాల చెట్టు సమీపంలో ఉన్న ఈ స్థలాన్ని గత 70 ఏళ్లుగా స్మశానవాటికగా వినియోగిస్తున్నారు. ప్రతి ఏడాది బక్రీద్ రోజున పెద్దల సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని తెలిపారు. అలాగే మేకల బలి, చిన్నారుల చెవులు కుట్టించడం వంటి సంప్రదాయ కార్యక్రమాలు కూడా ఇక్కడే నిర్వహిస్తుంటామని పేర్కొన్నారు. అయితే ఈ స్థలం అటవీ శాఖ ఆధీనంలో ఉందని, అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గేటుకు తాళం వేస్తున్నారని మసీదు కమిటీ సభ్యులు తెలిపారు. గత 15 ఏళ్లుగా పండుగలు, ఇతర మతపరమైన కార్యక్రమాలు నిర్వహించకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తమ పూర్వీకుల సమాధులు ఇదే ప్రాంతంలో ఉన్నాయని చెప్పారు. బక్రీద్ సందర్భంగా గురువారం ఉదయం వంద మందికి పైగా ముస్లింలు ప్రార్థనల కోసం కబరస్థాన్‌కు చేరుకోగా గేటు మూసి ఉండటంతో అక్కడే నిలిచిపోయారు. అటవీ శాఖ అధికారులకు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందన రాలేదని వాపోయారు. కనీసం పండుగ రోజునైనా ప్రార్థనలు చేసుకునేందుకు అవకాశం కల్పించి ఉండాల్సిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, మున్సిపల్ చైర్మన్ చొరవ తీసుకుని అటవీ శాఖ అధికారులతో మాట్లాడి కబరస్థాన్ స్థలాన్ని ముస్లింల వినియోగానికి కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మసీదు కమిటీ సదర్ షేక్ ముజ్బుల్ రహమాన్, సయ్యద్ ఫయాజ్ (కార్యదర్శి), షేక్ సఫిఉల్లా (ముఖ్య సలహాదారు), షేక్ నజీమ్ (కోశాధికారి), మహబూబ్ పాషా, షేక్ రహమాన్, చంద్‌పాషా, యాసిన్, కరీముల్లా, బాజీ, లాలు, పాషా, జిన్నీ, అబ్దుల్ నసీర్ తదితరులు పాల్గొన్నారు.

# మండల అధ్యక్షుడు కొమ్ము వెంకటస్వామిని సన్మానించిన వెల్టూర్ కాంగ్రెస్ నాయకులు



**పెద్దమందడి,మే28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన కొమ్ము వెంకటస్వామిని వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కొమ్ము వెంకటస్వామి సమర్థవంతంగా పనిచేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. గ్రామ స్థాయి నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకలాపాలను మరింత చురుకుగా నిర్వహిస్తూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు.అనంతరం పూలమాలలు వేసి, శాలువాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. మండల ప్రజల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని కొమ్ము వెంకటస్వామి తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.సన్మానించిన వారిలో వెల్టూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ప్రేమ్ సాగర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు బాబు రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ మల్లికార్జున్ ఉన్నారు.


# ఐక్యత, త్యాగానికి ప్రతీక బక్రీద్ పండుగ



**సర్పంచ్ మధిర మంజుల శ్రీశైలం**

**పెద్దమందడి,మే28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం పామిరెడ్డి పల్లి గ్రామంలో బక్రీద్ పండుగ సందర్భంగా గ్రామ సర్పంచ్ శ్రీమతి మధిర మంజుల శ్రీశైలం ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బక్రీద్ పండుగ ఐక్యత, త్యాగం, సోదరభావానికి ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు.మత భేదాలు లేకుండా ప్రతి ఒక్కరూ పరస్పర ప్రేమాభిమానాలతో పండుగలను జరుపుకోవడం సమాజానికి మంచి సందేశమని అన్నారు.గ్రామ ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# కొత్త పదవులతో కాంగ్రెస్ నేతల్లో ఆనందం.. శుభాకాంక్షలు తెలిపిన పార్టీ శ్రేణులు



**పెద్దమందడి,మే28(తెలంగాణ ముచ్చట్లు):**

వనపర్తి జిల్లా పెద్దమందడి మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఎన్నికైన కొమ్ము వెంకటస్వామిని, పెద్దమందడి-ఖిల్లా ఘనపూర్ మండలాల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్‌గా నియమితులైన వెంకటేశ్వర రెడ్డిని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ.. కొత్త బాధ్యతలతో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. కొమ్ము వెంకటస్వామి మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, వెంకటేశ్వర రెడ్డి రైతుల సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేయాలని ఆకాంక్షించారు.సన్మానానికి స్పందించిన కొమ్ము వెంకటస్వామి, వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ.. తమపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రజాసేవ కోసం నిరంతరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ రామకృష్ణారెడ్డి, మాజీ జెడ్పిటిసి రమేష్ గౌడ్, సర్పంచులు సూర్యగంగా రవి, స్వరూప, రాములు యాదవ్, వెంకటేష్, మాజీ సర్పంచులు శ్రీనివాస్ రెడ్డి, సిద్దయ్య, త్రినాథ్, బాబు రెడ్డి, శ్రీశైలం, రాఘవేందర్, నరేష్, ప్రవీణ్ రెడ్డి, మల్లికార్జున్, ప్రేమ్ సాగర్, మొగిలయ్య, ఉషన్న, సుదర్శన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.


# బీఆర్ఎస్ తప్పుడు ప్రచారాలకు రైతులు మోసపోవద్దు

**పెద్దమందడి కాంగ్రెస్ నేతల హెచ్చరిక**



**పెద్దమందడి,మే28(తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా పెద్దమందడి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొమ్ము వెంకటస్వామి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు గురువారం మీడియా సమావేశం నిర్వహించి మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు ఘాటుగా స్పందించారు. ఇటీవల మండలంలోని పలు గ్రామాల్లో తడిసిన ధాన్యాన్ని పరిశీలించిన నిరంజన్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం ధాన్యం కొనుగోలులో పూర్తిగా విఫలమైందని ఆరోపించిన విషయం తెలిసిందే. అయితే ఆ విమర్శలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. రైతులు బీఆర్ఎస్ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి ప్రభుత్వం అని, రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు.వర్షాలకు తడిసిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. మరో వారం రోజుల్లో మండలంలోని ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తవుతుందని, రైతులు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. గత బీఆర్ఎస్ పాలనలోనే రైస్ మిల్లుల్లో భారీ అవకతవకలు జరిగాయని, వాటిపై చర్యలు తీసుకుని అనేక మిల్లుల అనుమతులను రద్దు చేయడంతో ప్రస్తుతం కొంత ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందని విమర్శించారు.రైతుల సమస్యలను పరిష్కరించడంపై కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి దృష్టి పెట్టిందని, కేవలం రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ నేతలు అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు.ధాన్యం కొనుగోలు ప్రక్రియ పారదర్శకంగా కొనసాగుతోందని, రైతులకు ఎలాంటి అన్యాయం జరగదని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# సీయూఈటీ పరీక్షలకు కొత్త తేదీలు

- **ఈద్ ఉల్ అజా కారణంగా పరీక్ష వాయిదా**
- **మే 31, జూన్ 6, 7న పరీక్షలు**
- **అడ్మిట్ కార్డులు విడుదల చేసిన ఎన్టీఏ**

దేశవ్యాప్తంగా యూనివర్సిటీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే సీయూఈటీయూజీ 2026 పరీక్షలకు సంబంధించిన కొత్త తేదీలను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసింది. ఈద్ ఉల్ అజా పండుగ సందర్భంగా మే 28న జరగాల్సిన పరీక్షలను రద్దు చేసిన ఎన్టీఏ, వాటిని మే 31తో పాటు జూన్ 6, 7 తేదీల్లో నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదలైంది. మే 31న నిర్వహించనున్న పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను ఇప్పటికే విడుదల చేసినట్లు ఎన్టీఏ తెలిపింది. అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ అడ్మిట్ కార్డులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని పేర్కొంది. అలాగే జూన్ 6, 7 తేదీల్లో జరిగే పరీక్షలకు సంబంధించిన అడ్మిట్ కార్డులను త్వరలో విడుదల చేయనున్నట్లు వెల్లడించింది. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు తాజా సమాచారం కోసం అధికారిక వెబ్‌సైట్‌ను తరచుగా పరిశీలించాలని ఎన్టీఏ సూచించింది. పరీక్షా కేంద్రం, సమయం, సబ్జెక్టులకు సంబంధించిన వివరాలను అడ్మిట్ కార్డుల్లో జాగ్రత్తగా పరిశీలించాలని తెలిపింది. దేశంలోని సెంట్రల్, స్టేట్, ప్రైవేట్ యూనివర్సిటీల్లో అడ్మిషన్ ప్రక్రియను ఒకే విధానంలో నిర్వహించేందుకు సీయూఈటీయూజీ పరీక్షా విధానాన్ని 2022లో ప్రవేశపెట్టారు. దీనివల్ల విద్యార్థులు ఒక్క పరీక్ష ద్వారా అనేక విశ్వవిద్యాలయాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం లభించింది.

ఇంతకుముందు ప్రతి యూనివర్సిటీ వేర్వేరు ప్రవేశ పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రయాణ ఖర్చులు, పరీక్షల ఒత్తిడి, తేదీల గందరగోళం వంటి సమస్యలు ఉండేవి. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని కేంద్ర ప్రభుత్వం సీయూఈటీ విధానాన్ని అమల్లోకి తీసుకొచ్చింది. ప్రస్తుతం సీయూఈటీ దేశవ్యాప్తంగా ఉన్న ఉన్నత విద్యా సంస్థల్లో ప్రవేశాలకు కీలక పరీక్షగా మారింది. లక్షలాది మంది విద్యార్థులు ఈ పరీక్షకు హాజరవుతుండటంతో తేదీల మార్పు, అడ్మిట్ కార్డుల వివరాలపై అభ్యర్థుల్లో ఆసక్తి నెలకొంది. అధికారులు ప్రకటించే తాజా సమాచారం ప్రకారం పరీక్షలకు సిద్ధంగా ఉండాలని విద్యార్థులకు సూచిస్తున్నారు.



# ఐరోపా దేశాలతో బలోపేతం అవుతున్న భాగస్వామ్యం

- **లిమాసోల్‌లో జైశంకర్ పర్యటన**
- **విదేశాంగ మంత్రుల సమావేశంలో పాల్గొనడం**
- **బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థపై చర్చ**

భారత విదేశాంగ మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్ ఐరోపా సమాఖ్య విదేశాంగ మంత్రుల అనౌపచారిక సమావేశంలో పాల్గొనేందుకు లిమాసోల్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఐరోపా సమాఖ్యతో పాటు ఆ ప్రాంత దేశాలతో భారత్ భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతోందని పేర్కొన్నారు. పలు కీలక రంగాల్లో పరస్పర సహకారం విస్తరిస్తోందని తెలిపారు. సమావేశంలో భారత్, ఐరోపా సమాఖ్య మధ్య ఉన్న వ్యూహాత్మక సంబంధాలపై విస్తృత చర్చ జరిగినట్లు జైశంకర్ వెల్లడించారు. వాణిజ్యం, సాంకేతికత, భద్రత, ఇంధనం వంటి పలు రంగాల్లో సహకార అవకాశాలను పరిశీలించినట్లు తెలిపారు. భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా ఆచరణాత్మక భాగస్వామ్యంపై దృష్టి సారించినట్లు పేర్కొన్నారు. ప్రపంచ రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో చోటుచేసుకుంటున్న మార్పుల నేపథ్యంలో బహుళ ధ్రువ ప్రపంచ వ్యవస్థపై కూడా సమావేశంలో చర్చించినట్లు జైశంకర్ తెలిపారు. ప్రపంచ స్థిరత్వం, పరస్పర సహకారం, సామూహిక ప్రయోజనాల కోసం దేశాలు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. భారత్, ఐరోపా సమాఖ్య మధ్య సంబంధాలు ఇటీవలి కాలంలో మరింత బలపడుతున్నాయని విశ్లేషకులు భావిస్తున్నారు. వాణిజ్య ఒప్పందాలు, సాంకేతిక సహకారం, భద్రతా భాగస్వామ్యం వంటి అంశాల్లో రెండు పక్షాలు చురుకుగా ముందుకు సాగుతున్నాయి. అంతర్జాతీయ వేదికలపై కూడా పరస్పర సహకారం పెరుగుతోందని చెబుతున్నారు. లిమాసోల్‌లో జరిగిన సమావేశం ద్వారా భారత్‌ఐరోపా సంబంధాలకు కొత్త దిశ లభించే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ఇరు పక్షాల మధ్య ఉన్న సామాన్య ప్రయోజనాల ఆధారంగా మరిన్ని భాగస్వామ్య కార్యక్రమాలు రూపుదిద్దుకునే అవకాశం ఉందన్నారు. ప్రపంచ స్థాయిలో సహకారాన్ని మరింత విస్తరించేందుకు భారత్ కట్టుబడి ఉందని తెలిపారు. ప్రపంచ రాజకీయాల్లో మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా భారత్ తన విదేశాంగ విధానాన్ని మరింత విస్తరిస్తోందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఐరోపా దేశాలతో బలమైన సంబంధాలు దేశ ఆర్థిక, వ్యూహాత్మక ప్రయోజనాలకు దోహదపడతాయని చెబుతున్నారు. లిమాసోల్ సమావేశం ఈ దిశగా కీలకంగా మారనుందని భావిస్తున్నారు.

# సిక్కిం పోలీసులకు విశిష్ట గౌరవం

- **పోలీసు కలర్ ప్రదానం చేసిన రాష్ట్రపతి**
- **ప్రజలకు మార్గదర్శకులుగా పోలీసులు**
- **సురక్షిత సమాజ నిర్మాణమే లక్ష్యం**



సిక్కిం పోలీసులకు భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము "భారత రాష్ట్రపతి పోలీసు కలర్" పురస్కారాన్ని ప్రదానం చేశారు. గ్యాంగ్‌టక్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ గౌరవాన్ని అందజేశారు. దేశ సేవలో విశిష్ట ప్రతిభ కనబరిచిన పోలీసు విభాగాలకు ఈ గౌరవం ప్రదానం చేయడం ఆనవాయితీగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మాట్లాడుతూ, పోలీసులు కేవలం చట్ట అమలు సంస్థగానే కాక ప్రజలకు భాగస్వాములు, మార్గదర్శకులుగా కూడా మారాలని సూచించారు. ప్రజలతో మరింత సాన్నిహిత్యం పెంచుకుని విశ్వాసాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సమాజంలో భద్రతతో పాటు బాధ్యతాయుత అవగాహన పెంపొందించడంలో పోలీసుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. నేరస్తులను పట్టుకోవడం మాత్రమే పోలీసు వ్యవస్థ లక్ష్యం కాకూడదని రాష్ట్రపతి స్పష్టం చేశారు. సురక్షితమైన, సామాజిక చైతన్యంతో కూడిన సమాజ నిర్మాణం కూడా పోలీసు వ్యవస్థ ప్రధాన బాధ్యతగా ఉండాలని చెప్పారు. ప్రజల్లో నైతిక విలువలు, సామాజిక బాధ్యత పెంపొందించడంలో పోలీసులు చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.

సిక్కిం పోలీసు విభాగం సేవలను రాష్ట్రపతి ప్రశంసించారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో వారు చూపుతున్న కట్టుబాటు అభినందనీయమని పేర్కొన్నారు. క్లిష్ట పరిస్థితుల్లో కూడా విధులను సమర్థంగా నిర్వహిస్తూ ప్రజల విశ్వాసాన్ని పొందుతున్నారని కొనియాడారు. కార్యక్రమంలో పోలీసు అధికారులు, సిబ్బంది, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్రపతి చేతుల మీదుగా విశిష్ట గౌరవం అందుకోవడం సిక్కిం పోలీసులకు గర్వకారణంగా నిలిచింది. కార్యక్రమం ఘనంగా జరిగింది. పోలీసు వ్యవస్థ ఆధునిక సాంకేతికతతో పాటు మానవీయ దృక్పథాన్ని కూడా అవలంబించాలని రాష్ట్రపతి సూచించారు. ప్రజల సమస్యలను అర్థం చేసుకుని వారికి భరోసా కల్పించే విధంగా పనిచేయాలని అన్నారు. సమాజ శాంతి, భద్రతల పరిరక్షణలో పోలీసుల సేవలు అత్యంత కీలకమని పేర్కొన్నారు.

# సమృద్ధిగా ఇంధన నిల్వలు




- **పశ్చిమాసియా పరిస్థితులపై సమీక్ష**
- **ఆందోళనతో కొనుగోళ్లు చేయొద్దన్న రాజ్‌నాథ్**
- **దేశంలో ఎరువుల నిల్వలు కూడా సురక్షితం**

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దేశంలో నిత్యావసర వస్తువుల లభ్యత, సరఫరా వ్యవస్థపై కేంద్ర ప్రభుత్వం సమీక్ష నిర్వహించింది. కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ నేతృత్వంలోని అనధికార మంత్రుల బృందం సమావేశమై పరిస్థితులను పరిశీలించింది. దేశంలో సరఫరా పరిస్థితి పూర్తిగా సాధారణంగానే ఉందని, ప్రజలు ఆందోళనతో ఇంధనాన్ని అధికంగా కొనుగోలు చేయవద్దని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. దేశవ్యాప్తంగా పెట్రోలు, డీజిల్ సరఫరా సమృద్ధిగా ఉందని సమావేశంలో అధికార యంత్రాంగం వివరించింది. ఇంధన నిల్వల విషయంలో ఎలాంటి కొరత లేదని స్పష్టం చేసింది. శుద్ధి సామర్థ్యంలో భారత్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద దేశంగా కొనసాగుతోందని తెలిపింది. దేశీయ అవసరాలకు మించి శుద్ధి సామర్థ్యం ఉండటంతో సరఫరాపై ఎలాంటి ప్రభావం ఉండదని పేర్కొన్నారు. దేశంలోని ఎరువుల నిల్వ పరిస్థితి కూడా సౌకర్యవంతంగా ఉందని మంత్రుల బృందానికి అధికారులు వివరించారు. ఖరీఫ్ పంటల కాలానికి అవసరమైన ఎరువుల పరిమాణాన్ని వ్యవసాయ శాఖ ముందుగానే అంచనా వేసిందని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న నిల్వలు సాధారణ స్థాయికంటే ఎక్కువగా ఉన్నాయని వెల్లడించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సరఫరా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. పశ్చిమాసియాలో నెలకొన్న సంక్షోభ పరిస్థితులను కేంద్ర ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందని రాజ్‌నాథ్ సింగ్ పేర్కొన్నారు. అంతర్జాతీయ పరిస్థితుల ప్రభావం దేశీయ మార్కెట్లపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలు వదంతులను నమ్మకుండా ప్రశాంతంగా ఉండాలని కోరారు. నిత్యావసర వస్తువుల సరఫరా వ్యవస్థను మరింత బలోపేతం చేయాలని అధికారులకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. దేశవ్యాప్తంగా నిల్వలు, రవాణా, పంపిణీ వ్యవస్థలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అవసరమైన అన్ని చర్యలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. దేశ ప్రజలకు అవసరమైన ఇంధనం, ఎరువులు, ఇతర కీలక వస్తువుల విషయంలో ఎలాంటి కొరత ఉండదని కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. సరఫరా వ్యవస్థ పటిష్టంగా కొనసాగుతోందని తెలిపింది. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని కేంద్ర ప్రభుత్వం భరోసా ఇచ్చింది.

# ఇస్త్రీ ధరలపై చర్చ

- **బెంగళూరులో భారీ చార్జీలు**
- **నోయిడాతో పోలిస్తే రెండింతలు**
- **నెట్టింట వైరల్ అయిన వ్యాపారవేత్త వ్యాఖ్యలు**



దేశంలోని ప్రధాన నగరాల్లో జీవన వ్యయం రోజురోజుకూ పెరుగుతోంది. ముఖ్యంగా మహానగరాల్లో చిన్న చిన్న సేవల ధరలు కూడా సామాన్యులకు భారంగా మారుతున్నాయి. తాజాగా బెంగళూరులో బట్టల ఇస్త్రీ ధరలపై ఓ వ్యాపారవేత్త చేసిన వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో పెద్ద చర్చకు దారి తీశాయి. నోయిడాతో పోలిస్తే బెంగళూరులో ఇస్త్రీ చార్జీలు చాలా ఎక్కువగా ఉన్నాయని ఆయన పేర్కొనడం ఇప్పుడు వైరల్‌గా మారింది. బెంగళూరుకు చెందిన వ్యాపార పెట్టుబడిదారుడు సాజిత్ పాయ్ ఇటీవల నోయిడా నుంచి బెంగళూరులోని ఇందిరా నగర్ ప్రాంతానికి నివాసం మార్చుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక లాండ్రీ సేవల ధరలు చూసి ఆశ్చర్యపోయిన ఆయన తన అనుభవాన్ని సామాజిక మాధ్యమ వేదికలో పంచుకున్నారు. నోయిడాలో ఒక్కో బట్టకు కేవలం ఐదు రూపాయలు మాత్రమే తీసుకునేవారని, కానీ బెంగళూరులో మాత్రం పన్నెండు రూపాయల నుంచి ఇరవై రూపాయల వరకు వసూలు చేస్తున్నారని తెలిపారు. బెంగళూరులో ధరలు కొంచెం ఎక్కువగా ఉంటాయని ముందే ఊహించానని, కానీ ఇంత అధికంగా ఉండటం ఆశ్చర్యానికి గురిచేసిందని సాజిత్ పాయ్ పేర్కొన్నారు. ముంబై నుంచి వచ్చిన వారు కూడా ఇక్కడి ఇస్త్రీ ధరలు చూసి ఆశ్చర్యపోతున్నారని చెప్పారు. ఆయన చేసిన ఈ వ్యాఖ్యలు కొద్ది గంటల్లోనే వేలాది మందికి చేరుకుని చర్చనీయాంశంగా మారాయి.

ధరల వ్యత్యాసానికి గల కారణాలపై కూడా ఆయన అభిప్రాయం వ్యక్తం చేశారు. ఢిల్లీ పరిసర ప్రాంతాల్లో ఎక్కువగా బొగ్గుతో నడిచే ఇస్త్రీ పెట్టెలను ఉపయోగిస్తారని, కానీ బెంగళూరులో మాత్రం వంటగ్యాస్ ఆధారిత ఇస్త్రీ పరికరాలు వినియోగిస్తున్నారని తెలిపారు. ఇందువల్ల ఖర్చులు పెరిగి, సేవల ధరలు కూడా అధికమవుతున్నాయని అంచనా వేశారు. సాజిత్ పాయ్ చేసిన వ్యాఖ్యలపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు తమ ప్రాంతాల్లోని ధరలను పంచుకుంటూ సూరత్‌లో పది రూపాయలు, థానేలో ఏడు రూపాయలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. మరికొందరు మాత్రం ఇస్త్రీ కార్మికులకు మద్దతుగా నిలిచారు. ఇది శ్రమతో కూడిన పని అని, రోజంతా వేడి మధ్య పనిచేయాల్సి వస్తుందని, అందుకే వారు అధికంగా ఏమీ వసూలు చేయడం లేదని వ్యాఖ్యానించారు. ఇస్త్రీ సేవలతో పాటు పని మనుషులు, వాహనాల శుభ్రపరిచే సేవలు వంటి శారీరక శ్రమ ఆధారిత పనులన్నింటికీ దక్షిణ భారత మహానగరాల్లో ధరలు ఎక్కువగానే ఉంటాయని మరికొందరు అభిప్రాయపడ్డారు. మొత్తానికి ఓ చిన్న సామాజిక మాధ్యమ పోస్టు ఇప్పుడు మహానగరాల్లో పెరుగుతున్న జీవన వ్యయం, సేవల ధరలపై పెద్ద చర్చకు దారితీసింది.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక


# ప్రపంచ స్టాక్ మార్కెట్లలో భారత్‌కు షాక్..

ప్రపంచంలోని అత్యంత విలువైన స్టాక్ మార్కెట్ల జాబితాలో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. చిన్న దేశమైన తైవాన్ తాజాగా భారత్‌ను వెనక్కి నెట్టి ఐదో స్థానాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుతం భారత జనాభా 147 కోట్లకు పైగా ఉన్నప్పటికీ, దేశీయ పెట్టుబడిదారుల సంఖ్య మాత్రం ఇంకా పరిమితంగానే ఉండటం మార్కెట్ విస్తరణపై ప్రభావం చూపుతోందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.




నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్‌లో నమోదైన ఇన్వెస్టర్ల సంఖ్య ప్రస్తుతం 13 కోట్లకు పైగానే ఉంది. అయితే భారత్ కంటే ఎంతో చిన్న దేశమైన తైవాన్ స్టాక్ మార్కెట్ విలువ మాత్రం వేగంగా పెరుగుతోంది. బుధవారం ట్రేడింగ్‌లో తైవాన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ వెయిటెడ్ ఇండెక్స్ 1.68 శాతం పెరగడంతో అక్కడ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ దాదాపు 5 లక్షల కోట్ల డాలర్లకు చేరుకుంది. ఇక భారత ఎన్ఎస్ఈలో నమోదైన కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ 4.92 లక్షల కోట్ల డాలర్ల వద్ద నిలిచింది. దీంతో భారత్ ఆరో స్థానానికి పడిపోయింది. ప్రస్తుతం అమెరికా 77.95 లక్షల కోట్ల డాలర్ల మార్కెట్ క్యాపిటలైజేషన్‌తో ప్రపంచంలోనే అగ్రస్థానంలో కొనసాగుతోంది. ఆ తర్వాత చైనా 17.75 లక్షల కోట్ల డాలర్లు, జపాన్ 8.7 లక్షల కోట్ల డాలర్లు, హాంకాంగ్ 7.25 లక్షల కోట్ల డాలర్లతో వరుసగా రెండో, మూడో, నాలుగో స్థానాల్లో ఉన్నాయి.

తైవాన్ మార్కెట్ దూసుకెళ్లడానికి ప్రధాన కారణం సెమీకండక్టర్, టెక్నాలజీ రంగాలే అని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా కృత్రిమ మేధ యుగంలో చిప్ తయారీ కంపెనీలకు ప్రపంచవ్యాప్తంగా భారీ డిమాండ్ పెరగడం తైవాన్‌కు కలిసివచ్చింది.

తైవాన్‌కు చెందిన ప్రపంచ ప్రఖ్యాత సెమీకండక్టర్ దిగ్గజం టీఎస్ఎంసీ ఈ వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోంది. ప్రపంచంలోనే అతిపెద్ద కాంట్రాక్ట్ చిప్ తయారీ సంస్థగా ఉన్న ఈ కంపెనీ.. ఎన్విడియా, యాపిల్, ఏఎండీ, క్వాల్‌కామ్ వంటి అంతర్జాతీయ టెక్నాలజీ దిగ్గజాల కోసం అత్యాధునిక ఏఐ చిప్‌లను తయారు చేస్తోంది.

గత ఏడాది కాలంలో టీఎస్ఎంసీ షేర్లు 130 శాతానికి పైగా పెరగడం, తైవాన్ ప్రధాన స్టాక్ సూచీ ఈ ఏడాదిలోనే 52 శాతానికి పైగా ఎగబాకడం అక్కడి మార్కెట్ విలువను భారీగా పెంచింది.

మరోవైపు భారత్ స్టాక్ మార్కెట్ మాత్రం పలు అంతర్జాతీయ ఒత్తిళ్లతో కుదేలవుతోంది. పశ్చిమాసియా ఉద్రిక్తతలు, విదేశీ సంస్థాగత పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ, అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితులు భారత మార్కెట్లపై ప్రభావం చూపుతున్నాయి. ఈ ఏడాదిలో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు 8 శాతానికి పైగా నష్టపోయాయి. దీంతో భారత మార్కెట్ విలువలో కూడా గణనీయమైన తగ్గుదల కనిపిస్తోంది.

# మెటా కొత్త పెయిడ్ ప్లాన్లు..

ప్రపంచ ప్రముఖ సోషల్ మీడియా సంస్థ మెటా వినియోగదారుల కోసం కొత్త పెయిడ్ సబ్‌స్క్రిప్షన్ ప్లాన్లను ప్రవేశపెట్టింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, వాట్సాప్ వేదికలపై ప్రత్యేక ఫీచర్లు అందించేలా ఈ చెల్లింపు సేవలను అందుబాటులోకి తీసుకొచ్చింది.

ప్రస్తుతం ఈ ప్లాన్లు ప్రపంచవ్యాప్తంగా అమల్లోకి వచ్చాయి. స్టోరీలు, ప్రొఫైళ్లు, చాట్‌లు, రియాక్షన్‌లు, పోస్టులపై మరింత నియంత్రణ కోరుకునే వినియోగదారులను లక్ష్యంగా చేసుకుని ఈ సేవలను రూపొందించినట్లు మెటా వెల్లడించింది.




క్రియేటర్లు, వ్యాపార సంస్థలు, కృత్రిమ మేధ సాధనాలను ఎక్కువగా వినియోగించే వారికోసం 'మెటా వన్' పేరుతో ప్రత్యేక సబ్‌స్క్రిప్షన్ సేవలను కూడా తీసుకొచ్చింది. ప్రస్తుతం ఇవి 'మెటా వెరిఫైడ్' సేవలకు భిన్నంగా పనిచేస్తాయని సంస్థ తెలిపింది.

ఫేస్‌బుక్ ప్లస్, ఇన్‌స్టాగ్రామ్ ప్లస్ ప్లాన్ల ధరను నెలకు 3.99 డాలర్లుగా నిర్ణయించారు. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.362 వరకు ఉంటుంది. ఇక వాట్సాప్ ప్లస్ ధర నెలకు 2.99 డాలర్లు కాగా, భారత కరెన్సీలో దాదాపు రూ.271గా ఉంటుంది.

ఇక మెటా వన్ ప్లస్ ప్లాన్ ధర నెలకు 7.99 డాలర్లు కాగా, మెటా వన్ ప్రీమియం ప్లాన్ ధర నెలకు 19.99 డాలర్లుగా ఉంది. భారత కరెన్సీలో ఇది సుమారు రూ.725 నుంచి రూ.1,814 వరకు ఉంటుంది.

ఈ ప్రీమియం ప్లాన్లలో అధునాతన కృత్రిమ మేధ ఫీచర్లు, మరిన్ని ఫొటోలు, వీడియోలు రూపొందించే సదుపాయాలు, లోతైన విశ్లేషణ సామర్థ్యాలు లభించనున్నాయి. సాధారణ వినియోగదారులకు మెటా ఏఐ సేవలు ఉచితంగానే కొనసాగుతాయని సంస్థ స్పష్టం చేసింది.

# హైదరాబాద్‌లో ఈబీజీ గ్రూప్ భారీ విస్తరణ..



ఈబీజీ గ్రూప్ హైదరాబాద్‌లో భారీ పెట్టుబడులతో కొత్త తయారీ, అసెంబ్లింగ్, డిస్ట్రిబ్యూషన్ హబ్‌ను ఏర్పాటు చేసింది. రూ.25 కోట్ల పెట్టుబడితో 25 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించిన ఈ యూనిట్‌ను 'వజ్రం ఎలక్ట్రిక్' పేరుతో నిర్వహించనున్నట్లు సంస్థ ప్రకటించింది.

ఇప్పటికే నగరంలో అడ్వాన్స్‌డ్ అసెంబ్లింగ్ యూనిట్‌ను నిర్వహిస్తున్న ఈబీజీ గ్రూప్.. ఇప్పుడు వ్యాపార విస్తరణలో మరో కీలక అడుగు వేసింది. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడం, వ్యాపార కార్యకలాపాలను మరిన్ని రంగాలకు విస్తరించాలనే లక్ష్యంతో ఈ కొత్త యూనిట్‌ను ప్రారంభించినట్లు ఈబీజీ గ్రూప్ వ్యవస్థాపకుడు ఇర్ఫాన్ ఖాన్ తెలిపారు.

ప్రారంభ దశలోనే రూ.25 కోట్ల పెట్టుబడి పెట్టామని, భవిష్యత్తులో మరిన్ని పెట్టుబడులు పెట్టే ప్రణాళిక ఉందని ఆయన వెల్లడించారు. ఈ కొత్త యూనిట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 450 మందికి పైగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈబీజీ గ్రూప్ ఎలక్ట్రిక్ మొబిలిటీ, కన్జ్యూమర్ ఎలక్ట్రానిక్స్, నిర్మాణ రంగం, ఆహార మరియు పానీయాలు, మౌలిక సదుపాయాలు, ఆతిథ్య రంగాల్లో సేవలు అందిస్తోంది. కొత్త యూనిట్‌తో సంస్థ కార్యకలాపాలు మరింత విస్తరించే అవకాశముందని పరిశ్రమ వర్గాలు భావిస్తున్నాయి.

# హెల్మెట్లు, అంబులెన్స్‌లపై జీఎస్టీ తగ్గించాలి..

హెల్మెట్లు, అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై ప్రస్తుతం అమలులో ఉన్న వస్తు సేవల పన్ను తగ్గించాలని లేదా పూర్తిగా రద్దు చేయాలని గ్లోబల్ రోడ్ సేఫ్టీ సంస్థ ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఐఆర్ఎఫ్ గౌరవ అధ్యక్షుడు కేకే కపిల ప్రధానికి లేఖ రాశారు. ప్రస్తుతం హెల్మెట్లపై 18 శాతం జీఎస్టీ విధిస్తున్నారని, అయితే రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడడంలో హెల్మెట్లు కీలక పాత్ర పోషిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.




అలాగే అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య పరికరాలపై కూడా జీఎస్టీ భారాన్ని తొలగించాలని సూచించారు. ముఖ్యంగా ఆక్సిజన్ సాంద్రీకరణ యంత్రాలు, మానిటర్లు, వీల్‌చైర్లు, ఇంప్లాంట్లు, ఇతర అత్యవసర ఆరోగ్య పరికరాలపై పన్ను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు.

ప్రజల ప్రాణ భద్రత, అత్యవసర వైద్య సేవలను మరింత అందుబాటులోకి తీసుకురావాలంటే ఈ నిర్ణయం అవసరమని ఐఆర్ఎఫ్ అభిప్రాయపడింది. రోడ్డు ప్రమాదాల్లో మరణాల సంఖ్య తగ్గించేందుకు భద్రతా పరికరాల వినియోగాన్ని ప్రోత్సహించడం అత్యంత ముఖ్యమని సంస్థ పేర్కొంది.



# జూన్ నుంచి హ్యుందాయ్ కార్లు ఖరీదు.. కొనుగోలుదారులకు భారీ షాక్

సౌత్ కొరియాకు చెందిన ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం హ్యుందాయ్ మోటార్ ఇండియా.. కారు కొనుగోలుదారులకు షాకింగ్ న్యూస్ చెప్పింది. వచ్చే నెల జూన్ 1వ తేదీ నుంచి తమ కార్ల ధరలను పెంచనున్నట్లు కంపెనీ అధికారికంగా ప్రకటించింది. మోడల్, వేరియంట్‌ను బట్టి గరిష్టంగా రూ.12,800 వరకు ధరలు పెరగనున్నట్లు వెల్లడించింది. నిజానికి కార్ల ధరలను మే నెల నుంచే ఒక శాతం వరకు పెంచాలని హ్యుందాయ్ సంస్థ ఏప్రిల్‌లోనే ప్రకటించింది. అయితే కొన్ని అంతర్గత కారణాలతో ఆ నిర్ణయాన్ని జూన్‌కు వాయిదా వేసింది. ఇప్పుడు ఆ పెంపు అమల్లోకి రానుండటంతో కొత్త కారు కొనాలనుకునే వారికి అదనపు భారం తప్పదని తెలుస్తోంది. ఈ ధరల పెంపుకు గల కారణాలను కూడా కంపెనీ వివరించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆటోమొబైల్ రంగానికి అవసరమైన ముడిసరకుల ధరలు భారీగా పెరగడం, ఉత్పత్తి వ్యయాలు అధికమవడం, నిర్వహణ ఖర్చులు పెరగడం వంటి కారణాల వల్ల ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని హ్యుందాయ్ తెలిపింది. గత కొంతకాలంగా పెరుగుతున్న అదనపు భారాన్ని సంస్థే భరిస్తూ వచ్చిందని, కానీ ప్రస్తుతం పరిస్థితులు దృష్ట్యా ధరలు పెంచడం తప్పనిసరి అయిందని కంపెనీ పేర్కొంది. భారత మార్కెట్‌లో హ్యుందాయ్‌కు చెందిన క్రెటా, ఐ20, వెన్యూ, ఎక్స్టర్ వంటి మోడళ్లకు భారీ డిమాండ్ ఉంది. ముఖ్యంగా మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువగా ఈ కార్లను కొనుగోలు చేస్తుంటాయి. ఈ నేపథ్యంలో ధరల పెంపు నిర్ణయం వినియోగదారులపై ప్రభావం చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.కారు కొనుగోలు చేయాలని భావిస్తున్న వారు జూన్ 1కు ముందే బుకింగ్ పూర్తి చేస్తే ప్రస్తుతం ఉన్న ధరలకే వాహనం పొందే అవకాశం ఉండొచ్చని ఆటోమొబైల్ డీలర్లు సూచిస్తున్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# ఓటీటీలోకి వచ్చిన ధనుష్ 'కర'..

ధనుష్ హీరోగా తెరకెక్కిన లేటెస్ట్ హీస్ట్ థ్రిల్లర్ మూవీ కర తాజాగా ఓటీటీ ప్రేక్షకుల ముందుకు వచ్చేసింది. దర్శకుడు విఘ్నేష్ రాజా రూపొందించిన ఈ చిత్రం థియేటర్లలో ఆశించిన స్థాయిలో విజయాన్ని అందుకోలేకపోయినా.. ఇప్పుడు డిజిటల్ స్ట్రీమింగ్ ద్వారా మరోసారి ప్రేక్షకులను ఆకట్టుకునేందుకు సిద్ధమైంది.

ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ వేదిక లో తమిళంతో పాటు తెలుగు, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో స్ట్రీమింగ్ అవుతోంది. ఇంగ్లీష్ సబ్‌టైటిల్స్ సౌకర్యంతో కూడా సినిమా అందుబాటులోకి రావడంతో పాన్ ఇండియా ప్రేక్షకులకు చేరువైంది.

హీస్ట్ థ్రిల్లర్ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమాలో ధనుష్ తనదైన స్టైల్‌లో ఇంటెన్స్ పెర్ఫార్మెన్స్‌తో ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. సస్పెన్స్, యాక్షన్, ఎమోషనల్ ఎలిమెంట్స్ మేళవింపుతో దర్శకుడు కథను రూపొందించినప్పటికీ.. నెమ్మదైన కథనం, స్క్రీన్‌ప్లే ఆశించిన స్థాయిలో ఎంగేజ్ చేయలేకపోవడం వల్ల థియేటర్లలో మిశ్రమ స్పందన లభించింది.

ఈ చిత్రంలో ప్రేమలు ఫేమ్ మమితా బైజు హీరోయిన్‌గా నటించింది. ధనుష్‌తో ఆమె కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచిందని అభిమానులు చెబుతున్నారు. అలాగే సూరజ్ వెంజరామూడు, కేఎస్ రవికుమార్, జయరామ్ కీలక పాత్రల్లో కనిపించి మెప్పించారు.

వేల్స్ ఫిల్మ్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఇషారి కె గణేష్ నిర్మించిన ఈ సినిమాకు జి వి ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. ముఖ్యంగా బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ థ్రిల్లింగ్ సన్నివేశాలకు మరింత ఉత్కంఠను తీసుకువచ్చిందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఇప్పటికే ఓటీటీలో పలువురు తమిళ చిత్రాలు మంచి ఆదరణ పొందుతున్న నేపథ్యంలో 'కర' కూడా డిజిటల్ ప్రేక్షకులను ఎంతవరకు ఆకట్టుకుంటుందో ఆసక్తిగా మారింది. థియేటర్లలో నిరాశపరిచిన ఈ చిత్రం.. ఓటీటీలో కొత్త స్పందన దక్కించుకుంటుందేమో చూడాలి.




# ఆహాలో సచిన్ జీవితం

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ జీవిత కథ ఆధారంగా రూపొందిన 'సచిన్: ఏ బిలియన్ డ్రీమ్స్' చిత్రం ఇప్పుడు తెలుగు ప్రేక్షకులకు ఓటీటీలో అందుబాటులోకి వచ్చింది. ప్రముఖ తెలుగు డిజిటల్ వేదిక ఆహా ఈ చిత్రాన్ని మే 28 నుంచి ప్రసారం చేయడం ప్రారంభించింది. థియేటర్లలో మంచి ఆదరణ పొందిన ఈ చిత్రం ఇప్పుడు కుటుంబ ప్రేక్షకులను మరోసారి భావోద్వేగానికి గురిచేస్తోంది. సచిన్ చిన్ననాటి నుంచి ప్రపంచ క్రికెట్‌లో అగ్రస్థానానికి చేరుకున్న ప్రయాణాన్ని ఈ చిత్రంలో ఎంతో హృద్యంగా చూపించారు. చిన్న వయసులోనే క్రికెట్‌పై అతనికి ఏర్పడిన ఆసక్తి, కఠినమైన సాధన, అంతర్జాతీయ క్రికెట్‌లో ఎదుర్కొన్న ఒత్తిళ్లు, విజయాలు, వైఫల్యాలు అన్నింటినీ కళ్లకు కట్టినట్లు ఆవిష్కరించారు. 1983లో భారత జట్టు ప్రపంచకప్ గెలిచిన తర్వాత సచిన్‌లో కలిగిన ప్రేరణ నుంచి 2011లో ప్రపంచకప్ గెలిచే వరకు జరిగిన ప్రయాణం ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ చిత్రంలో సచిన్ కుటుంబ సభ్యులు పంచుకున్న అనుభవాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. భార్య అంజలి, సోదరుడు అజిత్ టెండూల్కర్ చెప్పిన ఎన్నో భావోద్వేగ సంఘటనలు అభిమానులను కదిలిస్తున్నాయి. అలాగే మహేంద్రసింగ్ ధోనీ, విరాట్ కోహ్లీ, వీరేంద్ర సెహ్వాగ్, సౌరవ్ గంగూలీ వంటి దిగ్గజ క్రికెటర్లు కూడా సచిన్‌తో తమ అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు.


చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ అందించిన నేపథ్య సంగీతం మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా సచిన్ వీడ్కోలు ప్రసంగం, ప్రపంచకప్ సంబరాల సన్నివేశాల్లో సంగీతం ప్రేక్షకులను భావోద్వేగానికి గురిచేస్తోంది.


క్రికెట్ అభిమానులకు మాత్రమే కాకుండా ప్రతి కుటుంబం తప్పక చూడాల్సిన ప్రేరణాత్మక చిత్రంగా ఇది నిలుస్తోంది. థియేటర్లలో మిస్ అయిన ప్రేక్షకులు ఇప్పుడు ఇంట్లోనే ఈ జీవిత గాథను ఆస్వాదించే అవకాశం పొందుతున్నారు.



# శ్రుతిహాసన్‌కు పాటలే ప్రత్యేక గుర్తింపు

అందం, అభినయం, గానం.. ఈ మూడు రంగాల్లోనూ తనదైన ముద్ర వేసిన నటీమణుల్లో శ్రుతిహాసన్ ఒకరు. ఒకప్పుడు వరుస సినిమాలతో టాలీవుడ్, కోలీవుడ్‌లో బిజీ హీరోయిన్‌గా కొనసాగిన ఆమె.. ఇప్పుడు ఆచితూచి కథలను ఎంపిక చేసుకుంటూ కెరీర్‌ను ముందుకు తీసుకెళ్తున్నారు. ఇటీవల కాలంలో ముఖ్యంగా పాన్ ఇండియా సినిమాల్లో నటిస్తూ వరుస విజయాలను అందుకుంటున్నారు. కెరీర్ ప్రారంభంలో సరైన విజయాల కోసం ఎదురుచూడాల్సి వచ్చినా.. ఆ తర్వాత వరుస హిట్లతో శ్రుతిహాసన్ స్టార్ హీరోయిన్‌గా ఎదిగారు. తెలుగు, తమిళ భాషల్లో స్టార్ హీరోల సరసన నటిస్తూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. హిందీలో కూడా కొన్ని సినిమాలు చేసినప్పటికీ అక్కడ ఆశించిన స్థాయిలో సక్సెస్ దక్కకపోవడంతో ప్రస్తుతం దక్షిణాది చిత్రాలపైనే ఎక్కువ దృష్టి పెట్టారు. ప్రభాస్ హీరోగా తెరకెక్కిన 'సలార్' సినిమాతో శ్రుతిహాసన్ మరో భారీ విజయాన్ని ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఆమెకు దేశవ్యాప్తంగా మరింత క్రేజ్ వచ్చింది. అలాగే సూపర్ స్టార్ రజనీకాంత్ నటించిన 'కూలీ' చిత్రంలో కూడా నటించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ప్రస్తుతం 'సలార్ 2'లో కూడా ఆమె కీలక పాత్రలో నటిస్తున్నారు. నటిగా మాత్రమే కాకుండా గాయనిగానూ శ్రుతిహాసన్ తన ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రైవేట్ ఆల్బమ్స్‌తో పాటు సినిమాల్లో కూడా అవకాశం దొరికినప్పుడల్లా పాటలు పాడుతూ అభిమానులను అలరిస్తున్నారు. ఇటీవల నాని హీరోగా నటించిన 'హాయ్ నాన్న' సినిమాలో ఆమె ఆలపించిన పాటకు మంచి స్పందన వచ్చింది. ఇక స్పెషల్ సాంగ్స్ విషయంలోనూ శ్రుతిహాసన్ తనదైన శైలిలో మెప్పిస్తున్నారు. ప్రస్తుతం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమాలో ఆమె చేసిన ప్రత్యేక గీతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఆ పాటలో ఆమె డాన్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే కమల్ హాసన్ నటించిన 'థగ్ లైఫ్' సినిమాలో కూడా శ్రుతిహాసన్ ఓ పాట పాడారు. ఆ పాట గురించి మాట్లాడుతూ.. తన కెరీర్‌లో ఎన్నో పాటలు పాడినా, ఈ పాటకు వచ్చిన స్పందన మాత్రం ప్రత్యేకమని తెలిపారు. తనను ఇష్టపడని వారు కూడా ఇప్పుడు మెసేజ్‌లు చేసి అభినందిస్తున్నారని చెప్పారు. తండ్రి కమల్ హాసన్ సినిమాలో పాట పాడటం తన జీవితంలో మరిచిపోలేని అనుభవమని భావోద్వేగంగా పేర్కొన్నారు.





# 'జైలర్ 2'లో హృతిక్ ఎంట్రీ?


సూపర్‌స్టార్ రజనీకాంత్ హీరోగా దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'జైలర్ 2'పై మరో ఆసక్తికర వార్త కోలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఇప్పటికే ఈ సీక్వెల్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొనగా.. ఇప్పుడు బాలీవుడ్ స్టార్ హీరో హృతిక్ రోషన్ ప్రత్యేక పాత్రలో కనిపించే అవకాశముందన్న వార్త మరింత ఉత్కంఠను పెంచుతోంది. తమిళ సినీ వర్గాల సమాచారం ప్రకారం.. మొదట ఈ ప్రత్యేక పాత్ర కోసం బాలీవుడ్ నటుడు షారుఖ్ ఖాన్‌ను సంప్రదించినట్లు తెలుస్తోంది. అయితే ప్రస్తుతం ఆయన 'కింగ్' సినిమా చిత్రీకరణలో బిజీగా ఉండటంతో ఆ ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో ఇప్పుడు దర్శక నిర్మాతల దృష్టి హృతిక్ రోషన్‌పై పడినట్లు కోలీవుడ్‌లో వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇక 'జైలర్' తొలి భాగం సాధించిన సంచలన విజయం తెలిసిందే. రజనీకాంత్ నటన, నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన మాస్ యాక్షన్ శైలి ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. ముఖ్యంగా ముత్తువేల్ పాండియన్ పాత్రలో రజనీకాంత్ చూపించిన స్టైల్, యాక్షన్ సన్నివేశాలు అభిమానులను ఉర్రూతలూగించాయి. ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లు సాధించిన ఈ చిత్రం రజనీకాంత్ కెరీర్‌లో మరో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఇప్పుడు అదే కథను మరింత విస్తృతంగా కొనసాగిస్తూ 'జైలర్ 2' తెరకెక్కుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఈ చిత్రంలో కూడా భారీ తారాగణం కనిపించనున్నట్లు సమాచారం. రజనీకాంత్‌తో పాటు మిథున్ చక్రవర్తి, విద్యాబాలన్, ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజారమూడు కీలక పాత్రల్లో నటిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. అలాగే తొలి భాగంలో ప్రత్యేక పాత్రలతో ఆకట్టుకున్న మలయాళ సూపర్ స్టార్ మోహన్‌లాల్, కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ కూడా ఈసారి తమ పాత్రలను కొనసాగించనున్నట్లు టాక్ వినిపిస్తోంది.

# 'స్పిరిట్'లో త్రిప్తి పాత్రపై ఆసక్తి

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కిస్తున్న భారీ చిత్రం 'స్పిరిట్'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే ఈ సినిమాపై దేశవ్యాప్తంగా భారీ చర్చ జరుగుతుండగా.. ఇప్పుడు హీరోయిన్ త్రిప్తి దిమ్రి పాత్ర గురించి వచ్చిన వ్యాఖ్యలు మరింత ఆసక్తిని పెంచుతున్నాయి.

తాజాగా దర్శకుడు హేమంత్ మధుకర్ చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో వైరల్‌గా మారాయి. సందీప్ రెడ్డి వంగా సినిమాల్లో హీరోయిన్ పాత్రలు కేవలం గ్లామర్‌కే పరిమితం కావని, కథలో భావోద్వేగాలకు బలమైన ఆధారంగా నిలుస్తాయని ఆయన తెలిపారు. మహిళా పాత్రలను ఎంతో లోతుగా, బలంగా రాసే దర్శకుల్లో సందీప్ ఒకరని ప్రశంసించారు.

ఈ సందర్భంగా 'అర్జున్ రెడ్డి' చిత్రంలోని ప్రీతి పాత్రను, 'యానిమల్' సినిమాలో గీతాంజలి పాత్రను ఆయన ఉదాహరణగా ప్రస్తావించారు. ఆ పాత్రలు కథలో కీలక మలుపులు తీసుకురావడమే కాకుండా ప్రేక్షకుల హృదయాలను తాకాయని పేర్కొన్నారు. హీరోకు జోడీగా మాత్రమే కాకుండా కథను ముందుకు నడిపించే శక్తివంతమైన పాత్రలుగా అవి నిలిచాయని చెప్పారు. త్రిప్తి దిమ్రి ఎంపికపై కూడా హేమంత్ స్పందించారు. ప్రతి పాత్రకు సరిపోయే నటిని దర్శకుడు ఎంపిక చేస్తాడని, పోలికలు పెట్టడం సరైంది కాదని అన్నారు. 'స్పిరిట్' కథలో త్రిప్తి పాత్రకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ఆమె నటన ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుందని ధీమా వ్యక్తం చేశారు.



Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in